# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

21.01.2026 బుధవారం Wednesday | సంపుటి (volume): 194 సంచిక (Issue): 194 | పేజీలు : 14 Pages : 14 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


# యూరియా యాప్‌పై కేంద్రం ప్రశంసలు



- ఖరీఫ్ కల్లా అన్ని జిల్లాలలో యాప్ సేవలు అమలు
- ఆర్గానిక్ పంటలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా త్వరలో యాప్
- అన్ని కమిటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశం

2

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్‌ను కేంద్ర ఫెర్టిలైజర్ శాఖ అభినందించిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. వచ్చే ఖరీఫ్ కల్లా ఈ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తేవాలన్నారు.

## సిట్టు.. లట్టు.. పొట్టుకు భయపడం

### సిట్ ఎన్నిసార్లు పిలిచినా వెళ్తాం

- ఫోన్ ట్యాపింగ్‌లో నిరాధార ఆరోపణలు
- సింగరేణి వ్యవహారంతో దృష్టి మరల్చే కుట్ర
- దాదాపు 7 గంటలపాటు ప్రశ్నించిన సిట్
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

3



## భైంసాలో ఘోర రోడ్డు ప్రమాదం

### కారును ఢీకొన్న కంటెయినర్

### ప్రమాదంలో నలుగురు దుర్మరణం



నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భైంసా బస్ డిపో సమీపంలో కారు- కంటైనర్ లారీ ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

2

## చలాన్ల వసూళ్ల కోసం వేధించవద్దు


ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

3



## సినిమా టికెట్ రేట్ల పెంపుదలపై హైకోర్టు ఆగ్రహం

### హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నోటీసులు



గత ఆదేశాలను ధిక్కరిస్తూ మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి ధరలు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

2

## ప్రశాంతంగా ముగిసిన టెట్

30న కీ విడుదల చేయనున్నట్లు వెల్లడి

2



## మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు




- మహిళలకు ఉచిత ప్రయాణం యథాతథం
- 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

3

## ఇంటర్ విద్యార్థులకు ఉపశమనం

ఐదు నిమిషాల ఆలస్యానికి బోర్డు ఆమోదం

2





దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణణ రైజిం గ్ బృందం మొదటి రోజు బిజీ బిజీగా గడిపింది. మంగళవారం ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ చైర్మన్ అలోన్ స్టోపెల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవ సాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్ లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ ఇన్నోవేషన్‌తో పాటు హెల్త్ టెక్, అగ్రి-టెక్, సైబర్ సెక్యూరిటీ, ఎరో స్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వా మ్యం పంచుకోవడానికి అంగీకారం తెలిపింది. ఈ సమావేశంలో సీఎంతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# పెట్టుబడులే లక్ష్యం

## దావోస్‌లో బడా కంపెనీలతో సీఎం చర్చలు

- తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి
- భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి యూఏఈ తోడ్పాటు
- ఏఐ రంగంలో తెలంగాణతో భాగస్వామ్యానికి రాయల్ ఫిలిప్స్ ఆసక్తి
- హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటుపై చర్చ
- దావోస్‌లో తెలంగాణ బృందం బిజీ

**హైదరాబాద్, జనవరి 20:** ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్-2026) సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం తొలిరోజే సత్తా చాటింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థల అధినేతలు, వివిధ దేశాల మంత్రులతో వరుస భేటీలు నిర్వహిస్తూ తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరిస్తున్నారు. 'తెలంగాణ రైజింగ్' నినాదంతో సాగుతున్న ఈ పర్యటనలో మొదటి రోజే పలు కీలక ఒప్పందాలకు పునాది పడింది. గూగుల్, యూనిలీవర్, ఫిలిప్స్ వంటి అంతర్జాతీయ సంస్థలతో పాటు యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా ప్రతినిధులతో జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ టెక్, స్కిల్ డెవలప్‌మెంట్, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి కీలక రంగాల్లో రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక సహకారం అందించేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. సీఎం వెంట మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి

మిగతా 2 లో

## మెట్రో ఫేజ్ 2 కోసం నిరంతర సంప్రదింపులు

కిషన్‌రెడ్డికి లేఖలో సీఎం విజ్ఞప్తి



2

## భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తోడ్పాటు

- బీజేపీ కొత్త సారథిగా నితిన్ నబిన్ సిన్హా
- పార్టీ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ
- హాజరైన ప్రధాని మోడీ, నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ
- సామాన్య కార్యకర్తకు అత్యున్నత స్థానానికి ఎదగడం బీజేపీలోనే సాధ్యం
- వివిధ అంశాలపై నితిన్ భావోద్వేగం
- నా బాస్ నితిన్ నబిన్ అంటూ మోడీ చమత్కారం

4



## సింగరేణి అవినీతిలో వారిది సమాన వాటా



- దానిని కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకున్నవి
- నైనీ బ్లాక్ వివాదం మీడియాలో వచ్చిన తరవాతే రద్దు
- ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ చేయించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్

3



# చలాన్ల వసూళ్ల కోసం వేధించవద్దు

## ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, జనవరి 20:** వాహన చలాన్లపై వాహనదారులను వేధింపులకు గురి చేయవద్దని ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది. వాహనాల తాళాలు లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ. 239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈ-చలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

# బైంసాలో ఘోర రోడ్డు ప్రమాదం

## కారును ఢీకొన్న కంటెయినర్ • ప్రమాదంలో నలుగురు దుర్మరణం



**నిర్మల్, జనవరి 20:** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భైంసా బస్ డిపో సమీపంలో కారు- కంటైనర్ లారీ ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. మృతులు నిర్మల్ జిల్లా కుబేర్ మండలం కుప్టి గ్రామానికి చెందిన వారిగా తెలుస్తోంది. మృతుల్ని బాబన్న, భోజ రాం పటేల్, రాజన్న, వికాస్‌గా గుర్తించారు. ఈ నలుగురు హైదరాబాద్ నుంచి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. కారు అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనతో రోడ్డుపై రాకపోకలకు ఆటంకం కలిగింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఇంటర్ విద్యార్థులకు ఉపశమనం

## ఐదు నిముషాల ఆలస్యానికి బోర్డు ఆమోదం

**హైదరాబాద్, జనవరి 20:** ఇంటర్ వార్షిక పరీక్షలకు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించాలని నిర్ణయం తీసుకున్నది. ఇదే నిబంధన నిరుడు అమలుకాగా, ఈసారి అమలు చేయనున్నారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. 9లక్షలకు పైగా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నెల 23న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 24న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగబోతున్నాయి. ఇవి ముగిసిన తర్వాత ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు రానున్నాయి.

# ప్రశాంతంగా ముగిసిన టెట్

## 30న కీ విడుదల చేయనున్నట్లు వెల్లడి

**హైదరాబాద్, జనవరి 20 :** తెలంగాణలో టెట్ ప్రశాంతంగా ముగిసాయి.. జనవరి 3న ప్రారంభమైన టెట్ పరీక్షలు జనవరి 20 వరకు జరిగాయి. ఈ సందర్భంగా టెట్ కన్వీనర్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని.. జనవరి 30న టెట్ పేర్క్షలకు సంబందించిన కీ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈసారి టెట్ పరీక్షకు మొత్తం 82.09 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు ప్రకటించారు టెట్ కన్వీనర్. టెట్ పేపర్-1, 2లకు కలిపి మొత్తం రెండు లక్షల 38 వేల మంది దరఖాస్తు చేసుకోగా..82.9 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఈసారి ఇన్ సర్వీసు టీచర్లు 71 వేల 670 మంది టెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన క్రమంలో ఈసారి భారీ సంఖ్యలో పోటీ నెలకొంది. టెట్ ఫలితాలు ఫిబ్రవరి 10 నుంచి 16 తేదీల మధ్య విడుదలవుతాయని తెలుస్తోంది.

# అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

## 12మంది ప్రయాణికులకు గాయాలు

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 20:** రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళుతున్న ట్రావెల్స్ స్లీపర్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గట్టుగూడెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. బస్సు అశ్వారావుపేట దాటి సుమారు 20 కిలోమీటర్లు వెళ్లిన తర్వాత గట్టుగూడెం వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను పోలీసు వాహనాలు, అంబులెన్సుల ద్వారా సమీప ఆస్పత్రికి తరలించారు.

# పెట్టుబడులే లక్ష్యంగా..

మొదటి పేజీ తరువాయి

శ్రీనివాస్ రెడ్డి పలువురు అధికారులతో కూడిన బృందం బిజీబిజీగా గడిపింది.

## ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీతో కీలక భేటీ

సీఎం రేవంత్ రెడ్డి ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యవసాయం, వాతావరణ మార్పుల రంగాల్లో ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారం అందించడంపై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్‌టెక్, హెల్త్ టెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్ రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ప్రకటించింది. త్వరలో ఇజ్రాయెల్ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణలో పైలట్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించేందుకు ఒప్పందం కుదిరింది.

## ఫ్యూచర్ సిటీకి యూఏఈ బాసట

హైదరాబాద్ శివార్లలో తలపెట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం తమ సహకారం అందిస్తుందని ఆ దేశ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టులో ఏఐ, విద్య, ఆరోగ్యం వంటి జోన్ల ఏర్పాటుపై సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు ఇరు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## స్కిల్ యూనివర్సిటీలో సౌదీ 'ఎక్స్‌పర్టైజ్' భాగస్వామ్యం

సౌదీ అరేబియాకు చెందిన పారిశ్రామిక సంస్థ 'ఎక్స్‌పర్టైజ్' తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో చేతులు కలిపేందుకు ఆసక్తి చూపింది. ఆ సంస్థ సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్ సీఎంతో భేటీ అయ్యారు. ఏటా తమకు అవసరమైన 5 వేల మంది నిపుణులను స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఎంపిక చేసుకునేందుకు, వారికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. పెట్రో కెమికల్స్, ఆయిల్, గ్యాస్ రంగాల్లో అవసరమైన శిక్షణను అందించేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది.

## ఏఐ, హెల్త్ టెక్‌లో ఫిలిప్స్ ఆసక్తి

ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్.. తెలంగాణలో ఏఐ ఆధారిత ఆరోగ్య సేవల విస్తరణకు ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో 'నాలెడ్జ్ హబ్' ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏఐ సిటీని నిర్మిస్తున్నామని, నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు ఇదే సరైన సమయమని మంత్రి శ్రీధర్ బాబు వారిని కోరారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పాలసీని ఫిలిప్స్ బృందం ప్రశంసించింది.

## గూగుల్ గ్లోబల్ ప్రెసిడెంట్‌తో చర్చలు

గూగుల్ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో



సీఎం రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయ రంగంలో ఏఐ వినియోగం, వాతావరణ మార్పుల వంటి అంశాల్లో తెలంగాణ ప్రభుత్వానికి సాంకేతిక సహకారం అందించేందుకు గూగుల్ అంగీకరించింది. కోర్ సిటీని కాలుష్య రహితంగా మార్చేందుకు, రైతుల సమస్యల పరిష్కారానికి గూగుల్ టెక్నాలజీని ఉపయోగించుకోనున్నారు.

## హైదరాబాద్‌లో యూనిలీవర్ జీసీసీ?

కన్స్యూమర్ గూడ్స్ దిగ్గజం యూనిలీవర్ సంస్థ హైదరాబాద్‌లో తమ 'గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్' (జీసీసీ) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. ఆ సంస్థ చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్‌తో జరిగిన భేటీలో సీఎం రేవంత్ ఈ ప్రతిపాదన ఉంచారు. హైదరాబాద్ ఇప్పటికే మెక్‌డొనాల్డ్స్, పెప్సీకో వంటి సంస్థల జీసీసీలకు కేంద్రంగా ఉందని, యూనిలీవర్ రాకకు అన్ని రకాల అనుమతులు వేగంగా ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనిపై సంస్థ సానుకూలంగా స్పందించింది.

# మెట్రో ఫేజ్ 2 కోసం నిరంతర సంప్రదింపులు

- కిషన్‌రెడ్డికి లేఖలో సీఎం విజ్ఞప్తి



**హైదరాబాద్, జనవరి 20:** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్2 ప్రాజెక్టు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి మంగళవారం సీఎం లేఖ రాశారు. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్తో ఇటీవల జరిగిన సమావేశం నేపథ్యంలో, మెట్రో ఫేజ్2 కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన అన్ని ప్రక్రియలను ఇప్పటికే ప్రారంభించినట్లు సీఎం తన లేఖలో వివరించారు. జనవరి 15న కిషన్ రెడ్డి రాసిన లేఖను ప్రస్తావిస్తూ, మెట్రో ఫేజ్ 2 నిర్మాణానికి సంబంధించి కేంద్రం నుంచి ఇద్దరు అధికారులు, రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారులు ఉండే సంయుక్త కమిటీ ఏర్పాటు విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఈ కమిటీలో రాష్ట్ర తరపున అధికారుల నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ఇప్పటికే కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్2 ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం లభించేలా తన పలుకుబడిని ఉపయోగించాలని కిషన్ రెడ్డిని కోరారు. రాష్ట్ర ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ కీలక ప్రాజెక్టును వెంటనే ఆమోదించాల్సిన అవసరం ఉందని లేఖలో స్పష్టం చేశారు.

# యూరియా యాప్‌పై కేంద్రం ప్రశంసలు

- ఖరీఫ్ కల్లా అన్ని జిల్లాలలో యాప్ సేవలు అమలు
- ఆర్గానిక్ పంటలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా త్వరలో యాప్
- అన్ని కమిటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి
- మంత్రి తుమ్మల ఆదేశం



**హైదరాబాద్,జనవరి 20 :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్‌ను కేంద్ర ఫెర్టిలైజర్ శాఖ అభినందించిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. వచ్చే ఖరీఫ్ కల్లా ఈ యాప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తేవాలని అన్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, కో-ఆపరేషన్ మరియు హార్టికల్చర్ శాఖల పురోగతిపై వ్యవసాయశాఖ సెక్రటరి మరియు ఆయా శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం మరియు తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికి, మార్కెట్లో నకిలీ ఆర్గానిక్ లేబుల్లతో నకిలీ ఉత్పత్తులు చలామణీ అవుతున్నందున నిజమైన ఆర్గానిక్ పంటలు పండించే రైతులకు నష్టం చేకూరుతుందని మంత్రిగారు అన్నారు. ఇందుకోసం వ్యవసాయశాఖ ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇచ్చే విధంగా ఒక యాప్ తీసుకురానుందని అన్నారు. ఈ యాప్ ద్వారా కొనుగోలుదారు తాను కొనబోయే ఉత్పత్తి ఎక్కడ, ఏ రైతు, ఎలా పండించాడో తెలుసుకుంటాడని అన్నారు. అదేవిధంగా అగ్రివర్సిటీలలోని ఖాళీ ప్రదేశాలలో ఆర్గానికి పంటలు పండించి, అక్కడే స్టాల్స్ పెట్టి అమ్మినట్లైతే రైతులు ఆర్గానిక్ పంటలవైపు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకే లభించేలా, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి పైసను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని, కేంద్రం నుంచి వచ్చే ఒక్క పైసా కూడా వృథాగా తిరిగి వెళ్లకూడదని అధికారులకు సూచించారు. చ్చే ఖరీఫ్ నాటికి పెద్దమొత్తంలో యూరియా బఫర్ స్టాక్‌లను నిల్వలో ఉంచుకోవాలని, భవిష్యత్తులో యూరియా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైల్వే రేక్ పాయింట్లను కూడా ఎరువుల పంపిణీకి తగ్గట్లుగా ఉండేలా, మరికొన్ని రైల్వే రేక్ పాయింట్లను అదనంగా ఏర్పాటు చేసేవిధంగా రైల్వే అధికారులను కోరాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే సన్నాలకు బోనస్ ఇస్తున్నందున, పంటకాలనికి అనుగుణంగా వ్యవసాయశాఖ ద్వారా సన్న వడ్లలో మేలైన వంగడాలను సూచించాలని, రైతులు అట్టి రకాలను ఉత్పత్తి చేసి మంచిధర పొందేటట్లు చూడాలని అన్నారు. అధికశాతం కచ్చితత్వంతో శాటిలైట్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ నెలాఖరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంటల శాటిలైట్ మ్యాపింగ్ డేటా రావాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లో కేంద్రం ఇచ్చిన లక్ష్యానికి రెట్టింపు ఎ÷-లాంటేషన్ జరిగేలా అధికారులు పనిచేయాలని మంత్రి అన్నారు. తక్కువ పురోగతి ఉన్న ఆయిల్ పామ్ కంపెనీలను రద్దు చేసి, వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు గాని, వేరే ఇతర కంపెనీలకు కేటాయించాలన్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా కూరగాయల సాగును ప్రోత్సహించాలని, కూరగాయల సాగులో విజయవంతం అయిన రైతులను రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఇతర రైతులతో మాట్లాడించాలి. గ్రామాలలోనే కాకుండా పట్టణాలలో కూడా అందుబాటులో ఉన్న స్థలాలలో మరియు టెర్రస్ ల మీద కూరగాయలు పండించేలా అవగాహన కల్పించాలని అన్నారు. ల్గ÷తులకోసం డిపార్ట్ మెంట్లలో గాని, యూనివర్సిటీలలో గాని మరియు కార్పోరేషన్లలో గాని ఏర్పాటు చేసే ప్రతి కమిటీలలో అధికారులతో పాటు రైతుల ప్రాతినిధ్యం వహించేలా కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా కమటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉన్నట్లైతే రైతుల అవకాశాలు, అవసరాలకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకోవచ్చని అన్నారు. రైతు వేదికల దగ్గర సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. డిపార్ట్ మెంట్లకు సంబంధించి ఉన్న ఖాళీ ప్రదేశాలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, ఉత్పత్తి అయి మిగిలిన కరెంట్ ను గ్రిడ్ కు అమ్ముకొవచ్చని అన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా రెండు రైతువేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయగా, నెలకు 400 యూనిట్ల వరకు మిగులు కరెంట్ ఉత్పత్తి అవుతుందని అన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఊంఅం ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సినిమా టికెట్ రేట్ల పెంపుదలపై హైకోర్టు ఆగ్రహం

## హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నోటీసులు

**హైదరాబాద్, జనవరి 20:** సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక ఆదేశాలు జారీ చేసింది. 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు హోం శాఖ జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్‌కు హైకోర్టు సుమోటో కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. గత ఆదేశాలను ధిక్కరిస్తూ మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి ధరలు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యవహారంపై దాఖలైన పిటిషన్ పై అడ్వకేట్ విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. హోంశాఖ అధికారులు గత ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారని వాదించారు. మన శంకర వరప్రసాద్ సినిమా టికెట్ల రేట్లు పెంచిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురాకుండా దాచిపెట్టారంటూ పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ క్రమంలోనే సీవీ ఆనంద్‌కు హైకోర్టు కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ సినిమాస్ రెగ్యులేషన్ యాక్ట్-1955 ప్రకారమే ధరల నిర్ణయాలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమాకైనా టికెట్ ధరల పెంపు నిర్ణయం తీసుకునేటప్పుడు 90 రోజుల ముందే ప్రకటించాలని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా మళ్లీ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.



# సింగరేణి అవినీతిలో వారిది సమాన వాటా

- దానిని కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకున్నవి
- నైనీ బ్లాక్ వివాదం మీడియాలో వచ్చిన తరవాతే రద్దు
- ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ చేయించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్



**న్యూఢిల్లీ, జనవరి 20 :** సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లది సమాన పాత్ర ఉందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సింగరేణిలోని నైని బ్లాక్ వివాదంపై సీబీఐ లేదంటే ఏదైనా సంస్థతో దర్యాప్తు జరపాలన్నారు. ఇది ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య జరిగిన గొడవల వలనే బయటకు వచ్చింది. మీడియాలో వచ్చిన తర్వాతే నైని బ్లాక్ టెండర్లు రద్దు చేశారు. అంతకు ముందు టెండర్లు ఎందుకు రద్దు చేయలేదో భట్టి బయట పెట్టాలని ఆయన అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై రామచంద్రరావు తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. నైని బ్లాక్ వ్యవహారంలో పారదర్శకత లేదు. సింగరేణి అవినీతిలో బీఆర్ఎస్ పాత్ర ఉంది. రాష్ట్రమంతా నైని కోల్ బ్లాక్ గురించి మాట్లాడుతున్నారు. సింగరేణిలో ఎప్పుడూ కూడా రాష్ట్ర ప్రభుత్వం వాటా అధికంగా ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి లాభాల్లో ఉంది. నైని కోల్ బ్లాక్ అంశంతో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య వివాదాలు బయటపడ్డాయి. మంత్రులు బంధువులకు కోల్ బ్లాక్ కేటాయించే ప్రయత్నం చేశారు. కిషన్ రెడ్డికి లేఖ రాసే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదు. బీఆర్ఎస్ సుద్ద పూసేమీ కాదు. నైని బ్లాక్‌లో ఎవరికి ఎంత ముట్టిందో చెప్పాలి. సింగరేణిలో కమిషన్ కింద కోట్లు సంపాదిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ మంత్రుల మధ్య తగాదాలు అవుతున్నాయి. వారి వారి బంధువులకు కాంట్రాక్టులకు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు. హరీష్ రావుకు ఒకటే చెప్తున్నా.. సుద్దపూస మాటలు మాట్లాడొద్దు. రాష్ట్రాన్ని మొదట భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్.. దాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోంది. సింగరేణి ఉద్యోగులకు, ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి. స్టేట్ గవర్నమెంట్‌లో సిట్, ఇతర దర్యాప్తు సంస్థలు కూడా ఉన్నాయి. వాటితో కూడా విచారణ జరిపించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల అవినీతి, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై కూడా అవినీతి విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ కేసులో చాలా మంది అధికారులను అరెస్ట్ చేసినా.. రాజకీయ నాయకులను మాత్రం అరెస్ట్ చేయలేదు. తెలంగాణలో సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన సొంత ఆస్తిలా వాడుకుందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని బీజేపీ నేత రామచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా, పశ్చిమ బెంగాల్ తర్వాత తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీలో ఎటువంటి విబేధాలు లేవని, 'టీమ్ బీజేపీ తెలంగాణ'గా తామంతా ఐక్యంగా ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు.



# ఫోన్ ట్యాపింగ్ దోషులకు శిక్ష తప్పదు

## చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే డ్రామాలు

## కెటిఆర్, హరీష్ రావుల తీరుపై మండిపడ్డ పీసీసీ చీఫ్

**కామారెడ్డి, జనవరి 20 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటి వారున్నా శిక్ష తప్పదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఎవరున్నా విచారణ జరుగుతుందని అన్నారు. ఈ కేసుపై ఆయన స్పందించారు. సిట్ విచారణపై హరీశ్ రావు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ మండిపడ్డారు. చేసిన తప్పు కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు అతిపెద్ద నేరమని వ్యాఖ్యానించారు. టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. తన ఫోన్, షబ్బీర్ అలీ సహా చాలామంది ఫోన్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో మహేష్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలపై రాజకీయ వేధింపులకు పాల్పడే ఉద్దేశం సీఎం రేవంత్ రెడ్డికి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇంకోసారి ఇలాంటివి జరగకుండా చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. అలాగే బీజేపీపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. రాముడి, హిందు దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని.. ఎక్కడ ఎన్నికలు వచ్చిన అక్కడ హిందు, ముస్లింలకు బీజేపీ గొడవలు పెడుతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేవలం ఓట్ల కోసమే బీజేపీ నాయకులు జైశ్రీరాం అంటున్నారని విమర్శించారు. తనకు ఓటేసి గెలిపించిన ప్రజల కష్ట సుఖలను గాలికి వదిలేసి కేవలం ఓట్ల కోసమే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పని చేస్తున్నాడని దుయ్యబట్టారు. నిరుపేద ప్రజలకు ఉపాధిని కల్పించాలనే సదుద్దేశంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం కరెక్ట్ కాదన్నారు. గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ జనవరి 26 తరువాత ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్రంలోని మోడీ సర్కార్ పని చేస్తోందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ గొప్ప పార్టీ అని.. అలాంటి పార్టీలో ఉండటం అదృష్టమని అన్నారు. కార్యకర్తల కృషి వల్లే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్భందలు ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీ కోసం కార్యకర్తలు కృషి చేశారని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నామని చెప్పారు. ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని.. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక, ప్రతి గ్రామంలో సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాలనలో సర్పంచులదే మూడో స్థానమన్నారు.



# జాతీయగీతాలపనకు నిరాకరణ

## తమిళ అసెంబ్లీ నుంచి నిష్క్రమించిన గవర్నర్

**చెన్నై, జనవరి 20:** తమిళనాడు శాసనసభ సమావేశంలో తన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ ఆర్ఎన్ రవి నిష్క్రమించారు. ఈ ఏడాది శాసనసభ తొలి సమావేశం మంగళవారం ప్రారంభం కాగా తన ప్రసంగాన్ని చదవకుండానే ఆయన వాకౌట్ చేశారు. తమిళతల్లి ప్రార్థనా గీతం తర్వాత జాతీయగీతం ఆలపించాలని సభాపతిని గవర్నర్ కోరగా అందుకు నిరాకరించడంతో ఆయన వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అన్ని శాసనసభల్లోనూ గవర్నర్ ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయగీతాన్ని పాడతారని, ఇక్కడ ప్రసంగానికి ముందు ఆలపించాలని కోరినా ఉద్దేశపూర్వకంగానే నిరాకరించారని లోక్‌భవన్ వెల్లడించింది.

# నటుడు అక్షయ్ ఖన్నాకు తప్పిన ప్రమాదం

**ముంబై, జనవరి 20:** బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ వాహనానికి సోమవారం రాత్రి భారీ ప్రమాదం జరిగింది. అక్షయ్ కుమార్, ఆయన భార్య ట్వింకిల్ ఖన్నా విదేశీ పర్యటన నుంచి తిరిగి వస్తుండగా కాన్వాయ్‌లోని ఒక ఎస్కార్ట్ వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినగా, ఆటో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికుడికి గాయాలయ్యాయి. అక్షయ్, ట్వింకిల్ ప్రయాణిస్తున్న కారుకి స్వల్పంగా దెబ్బ తగిలినప్పటికీ.. వారిద్దరూ సురక్షితంగా ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం ముంబై జుహూ ప్రాంతంలో వేగంగా వచ్చిన ఒక మెర్సిడెస్ కారు ముందు వెళున్న ఆటోను ఢీకొట్టింది. ఆ ఆటో అదుపు తప్పి రోడ్డుకు అవతలివైపు ప్రయాణిస్తున్న అక్షయ్ ఎస్కార్ట్ కారును ఢీకొట్టినట్లు సమాచారం.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



## మహిళలకు ఉచిత ప్రయాణం యధాతథం

**51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు ● రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్,జనవరి20 :** మేడారం జాతరకు రాష్ట్రంలోని 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేడారానికి వెళ్లే మహిళలకు సైతం ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా శాఖ నుంచి 10, 441 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు ఆర్టీసీ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మేడారం విధుల్లో 7వేల మంది డ్రైవర్లు - 18 మంది కండక్టర్లు, 800 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 28వ తేదీ నుంచి 1వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపుతామని చెప్పుకొచ్చారు. మేడారం వెళ్లేటప్పుడు బస్సులు నిండుతాయని... వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని తెలిపారు. వన్ వేలో బస్సులు ఖాళీగా వెళ్తాయి కాబట్టి... రెగ్యులర్ ఛార్జీల కంటే 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారంలో 50ఎకరాల్లో వెయ్యి బస్సులు నిలిపేలా తాత్కాలిక బస్ షెల్టర్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. బస్ షెల్టర్ల వద్ద 9 కిలోమీటర్ల మేర 50 క్యూ లైన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. బస్టాండ్స్‌లో క్లోజ్డ్ సర్క్యూట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# వేధింపుల కేసులు మీకు అలవాటు

## మీ హయాంలో నేనూ బాధితుడినే

## కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ బల్మూరి వెంకట్



**హైదరాబాద్, జనవరి 20:** బిఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ నేతలపై అనేక వేధింపు కేసులు పెట్టిన విషయం మరిచనట్లు ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కోసం హరీశ్‌రావు అవయవాలు దానం చేసినట్లు.. బామ్మర్ది పోయి బావను పరామర్శిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అత్యధికంగా కేసులు పెట్టి తనను ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. 'గాంధీ భవన్ లోపలికి వచ్చి అర్ధరాత్రి నన్ను అరెస్ట్ చేశారు. నా కుటుంబ సభ్యులు సహా మా వాచ్‌మెన్ ఫోన్ కూడా ట్యాప్ చేశారు. రేవంత్ రెడ్డిపై డ్రోన్ కేసు పెట్టి 14 రోజులు జైల్లో పెట్టలేదా? గత ప్రభుత్వంలో ఎథికల్ హ్యాకర్‌ను ట్రైనింగ్ కోసం బయటి దేశాలకు పంపారా? లేదా.? నేను ఎక్కడికైనా వచ్చి ప్రమాణం చేస్తా, మీరూ వచ్చి ప్రమాణం చేస్తారా?' అని ఎమ్మెల్సీ వెంకట్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన ఆరోపణలకు బల్మూరి కౌంటర్ ఇస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తంలో స్కామ్‌లే అని కేటీఆర్ అంటున్నారని.. ఆధారాలుంటే బయటపెట్టాలని ఛాలెంజ్ చేశారు. కల్వకుంట్ల కుటుంబ గూడుపుఠానీలో కవిత భాగస్వామి అని.. అందుకే ఆమెను బయటకు పంపారన్నారు. కేటీఆర్ పదే పదే సృజన్ రెడ్డి అని ఆరోపణలు చేస్తున్నారని.. ఆయన చెప్తున్న సృజన్ రెడ్డి.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అల్లుడేనని బల్మూరి వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి వెంకట్ మాట్లాడుతూ.. చక్రధర్ గౌడ్ వేసిన కేసును సుప్రీంకోర్టు కొట్టేసిందని.. ఫోన్ ట్యాపింగ్ కేసుకు దానికి సంబంధం లేదన్నారు. ఏ విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 'లోపల జరుగుతున్న విచారణ మీకు ఎలా తెలుసు? మీకు ఎవరైనా కోవర్టులు ఉన్నారా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్సీ బల్మూరి.

# సిట్టు..లట్టు..పొట్టుకు భయపడం

- సిట్ ఎన్నిసార్లు పిలిచినా వెళ్తాం
- ఫోన్ ట్యాపింగ్‌లో నిరాధార ఆరోపణలు
- సింగరేణి వ్యవహారంతో దృష్టి మరల్చే కుట్ర
- దాదాపు 7 గంటలపాటు ప్రశ్నించిన సిట్
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు




**హైదరాబాద్, జనవరి 20:** కేసులు, అరెస్టులు మాకు కొత్త కాదని.. ఎన్ని కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సిట్టు, లట్టు, పొట్టుకు మేం భయపడమని.. సిట్ ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తానని స్పష్టం చేశారు. మంగళవారం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నాపై నిరాధార ఆరోపణలు చేశారని.. విచారణ పేరుతో సమయం వృధా చేశారని అన్నారు. నోటీసులు వస్తే పారిపోమని.. ఎన్ని విచారణలు అయినా ఎదుర్కొంటామన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం సమైక్య రాష్ట్రంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కేసులు పెడుతున్నారని.. కేసులు, అరెస్టులు మాకు కొత్తేమి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు నిలయంగా మారిందని.. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సింగరేణిలో వేల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరతీశాడని.. ఈ స్కామ్‌ను బట్టబయలు చేసినందుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు స్కాంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారు.. ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. దమ్ముంటే నన్ను విచారణ చేసినప్పుడు తీసిన వీడియో బైట పెట్టాలని.. అంతే కానీ చిల్లర లీకులు ఇవ్వొద్దని అన్నారు. ఇది లీకుల ప్రభుత్వం, స్కాముల ప్రభుత్వమని విమర్శలు గుప్పించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు ముందే ఉన్నాయన్నారు. ఇదిలావుంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంత్రి హరీష్ రావు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. హరీష్ రావు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. విచారణ ముగిసిన తర్వాత జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి నేరుగా ఆయన తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు.



సంపాదకీయం

# వరుస ఎన్నికలతో ఖజానాపై భారం!

ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగే. అలాగే ఓటర్లకు కూడా పండగలాగే సాగుతోంది. ఓట్ల పండగ ఎప్పుడు జరుగుతందన్న భావనలో ఓటర్లు ఉన్నారు. ఇంటికి కనీసం ఓ పదివేలయినా దక్కుతాయని భావిస్తున్నారు. నిజానికి తెలంగాణలో పంచాయితీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఇటీవల పంచాయితీ ఎన్నికలను పూర్తి చేశారు. అయితే ఈ ఎన్నికలన్నీ ఒకేదఫా నిర్వహించి ఉంటే ఖజానాపై భారం తప్పేది. ప్రజలకు భారం తప్పేది. కానీ రాజకీయ పార్టీలకు ముఖ్యంగా అధికార పార్టీకి విడతలుగా ఎన్నికలు జరగడం ఇష్టం. జమిలిగా ఎన్నికలు జరిపితే తాము అనుకున్నట్లుగా ఫలితాలు రాకుంటే అభాసుపాలవు తారు. అందుకే తొలుత పంచాయితీ ఎన్నికలు నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బహుశా ఈ ఫిబ్రవరిలో పంచాయితీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఆ తరవాత మార్చిలో జడ్పీ ఎన్నికలు జరగవచ్చు. ఇలా విడతలుగా ఎన్నికలు జరిగినా.. ఖజానా గుల్లయినా రాజకీయ పార్టీలకు వచ్చే నష్టం లేదు. ఆ నష్టమేదో ప్రజలు పన్నుల రూపంలో భరిస్తారు. ఇకపోతే ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు కావడంతో రానున్న వారం రోజుల్లో కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. వార్డులు, డివిజన్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా కసరత్తు చేస్తోంది. ఈక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ను హస్తగతం చేసుకునేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ క్యాండిడేట్లను గెలిపించుకునే బాధ్యతను మంత్రికి అప్పగించింది. ఒక్కో మంత్రిని ఇన్‌ఛార్జులుగా నియమించుకుంది. పార్లమెంట్ నియోజకవర్గానికో ఇన్‌చార్జీను నియమించింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు పార్టీ సింబల్ మీద జరగనుండడంతో అభ్యర్థుల ఎంపిక దగ్గరి నుంచి పోలింగ్ పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా గెలుపోటములపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీంతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు వ్యూహారచనలో ఉన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఒక కీలకమైన అడుగు పడింది. రాష్ట్ర మున్సిపల్ రిజర్వేషన్ల జాబితా ఖరారు కావడంతో, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ వివరాలను తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ జాబితాలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు , వార్డుల వారీగా కేటాయించిన రిజర్వేషన్లను స్పష్టంగా పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 116 మున్సిపాలిటీ లు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఉన్న 2,996 వార్డులు , డివిజన్లకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గం ఫిబ్రవరి నెలలో ఈ ఎన్నికల నిర్వహణకు ఆమోదాన్ని తెలిపింది. ప్రస్తుతం రిజర్వేషన్ల ప్రక్రియ కూడా విజయవంతంగా పూర్తి కావడంతో, ఎన్నికల నిర్వహణకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏ క్షణంలోనైనా అధికారికంగా మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. అభ్యర్థులు , రాజకీయ పార్టీలు ఈ రిజర్వేషన్ల ఆధారంగా తమ ప్రచార వ్యూహాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్న మయ్యారు. ఇకపోతే ఇప్పటికే మున్సిపల్ చైర్మన్లు, వార్డుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో పట్టణాల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. ఇప్పటివరకు ఏ వార్డు ఎవరికి రిజర్వ్ అవుతుందోననే టెన్షన్‌తో ఉన్న ఆశావహులు రిజర్వేషన్లు ఖరారు కావడంతో టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఇక ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టాయి. వార్డుల వారీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు, వారి గెలుపోటములపై ప్రభావం చూపే అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులను సిద్ధం చేసుకుంటున్నారు. రాజకీయ పార్టీ లీడర్లు అభ్యర్థుల ఎంపికలో బిజీగా ఉన్నారు. యువ ఓటర్లకు గాలం వేసేందుకు వార్డుల్లో ఆశావహులు తమవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఫిబ్రవరిలో పట్టణపోరు ప్రారంభం కానుంది. అందుకు అన్ని పార్టీలు కసరత్తులో ఉన్నాయి. గెలుపుపై ధీమాగానూ ఉన్నాయి. అయితే ప్రతి ఎన్నికల్లోనూ పార్టీలు గెలుస్తున్నాయి. ప్రజలు ఓడుతున్నారు. దీనిని వారు గుర్తించడం లేదు. డబ్బులు తీసుకుని ఓట్లు వేయడం పెరిగింది. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల్లో ఇది బయటపడింది. డబ్బులు తీసుకుని ఓట్లు వేయలేదని కొందరు అభ్యర్థులు తమ డబ్బులను వాపస్ ఇవ్వాలని నిలదీసారు. ఇలాంటి సంస్కృతి పోతే తప్ప నిజాయితీగా ఎన్నికలు సాగవు.




# భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తోడ్పాటు

- బీజేపీ కొత్త సారథిగా నితిన్ నబిన్ సిన్హా
- పార్టీ కార్యాయలంలో బాధ్యతల స్వీకరణ
- హాజరైన ప్రధాని మోడీ, నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ
- సామాన్య కార్యకర్తకు అత్యున్నత స్థానానికి ఎదగడం బీజేపీలోనే సాధ్యం
- వివిధ అంశాలపై నితిన్ భావోద్వేగం
- నా బాస్ నితిన్ నబిన్ అంటూ మోడీ చమత్కారం



**న్యూఢిల్లీ, జనవరి 20:** భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నితిన్ నబీన్ సిన్హా మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ సమక్షంలో కమల దళపతిగా నితిన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ తదితరులు హాజరయ్యారు. నితిన్ నబిన్ ఎన్నికైనట్లు ప త్రాన్ని కె.లక్ష్మణ్ అందచేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. 'ముందుగా మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక సాధా రణ కార్యకర్తనైన నన్ను పార్టీలోనే అత్యంత ఉన్నతమైన పదవికి చేరేలా చేశారు. నేను మీకు తలవంచి నమస్కరిస్తు న్నాను' అని అన్నారు.జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లులు కురిపించారు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ నిరంతరంగా దేశం కోసం పాటుపడుతున్న తీరును సాధారణ కార్యకర్తలమైన తాము గమనిస్తూనే ఉ న్నామన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అది నేను నేషనల్ జనరల్ సెక్రటరీగా ఉన్న సమయం. అప్పుడు మీరు(ప్రధాని మోదీ) సభావన మిషన్ ప్రోగ్రామ్ సందర్భంగా ప్రతీ ఒక్కరి కష్టాలను అడిగి తెలుసుకోవటం చూశాను. ఆ ప్రోగ్రామ్ తర్వాత మేము మీ గ్రీన్ రూము లో మిమ్మల్ని కలిశాము. గుజరాత్ నుంచి చాలా మంది ఆ ప్రోగ్రామ్‌కు ఎందుకు వస్తున్నారో భావోద్వేగపూరితంగా మీరు మాకు వివరించారు. ప్రజల ఎమోషన్స్‌తో కనెక్ట్ అయ్యే వారే గొప్ప నాయకులు అవుతారని నాకు అప్పుడు అర్థమయింది' అని చెప్పారు. సందర్భంగా నితిన్ నబీన్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రభుత్వం తిరుప్పరన్కుండ్రం కొండపై కార్తీగై దీపం పండుగ జరగకుండా ఆపడాన్ని ఆయన తప్పుబట్టారు. సోమనాథ్, రామ సేతు, ఇతర చిహ్నాల గురించి మాట్లాడితే ప్రతిపక్ష పార్టీలు అసహనానికి గురవుతాయని అన్నారు. రామసేతు లేదు అనే వారికి, కార్తీగై దీపం పండుగను అడ్డుకునే వారికి భారత రాజకీయాల్లో చోటులేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నితిన్ నబీన్‌ను ప్రశంసించారు. ఇప్పుడు నబీన్ తనకు బాస్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. నబీన్ తనకు బాస్ అని, తాను సాధారణ పార్టీ కార్యకర్త అని వ్యాఖ్యానించారు. 'భాజపాలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కాగలరు. భాజపాలో నిర్ణయాలు, ఎంపిక అన్నీ.. ప్రజాస్వామ్యయుతంగానే ఉంటాయి. దేశసేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. గతంలో ఆడ్వాణీ, వెంకయ్యనాయుడు నేతృత్వంలో ఘన విజయాలు సాధించాం. అందరి కృషితోనే మూడుసార్లు అధికారంలోకి వచ్చేలా పార్టీ ఎదిగింది. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. భాజపా కార్యకర్తను అనిపించుకోవడమే నాకు గర్వకారణం. భాజపాలో ప్రత్యేకంగా పదవులు, బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతిఒక్క కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. బాధ్యతలు ఒకరి నుంచి ఒకరికి మారతాయి.. లక్ష్యం మారదు. నాయకత్వం మారినా.. మన గమ్యం మారదు. భాజపా చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుం దని ప్రజలు భావిస్తున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని మోదీ అన్నారు. 45 ఏళ్ల నితిన్ నబీన్ కమల దళపతిగా నిన్న ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. పార్టీ చరిత్రలోనే చిన్న వయసులో జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఘనతను ఆయన సాధించారు. ఉమ్మడి బిహార్ నుంచి పార్టీ అధ్యక్ష స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ నిలిచారు. ప్రమాణ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నేతలు, ఎంపిలు, కేంద్రమంత్రులు హాజరయ్యారు.

# గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో ట్రంప్ దూకుడు

## యుద్ధ విమానం మొహరించేందుకు సిద్ధమైన అమెరికా

## తాజా పరిణామాలతో సర్వత్రా ఆందోళన




**వాషింగ్టన్, జనవరి 20:** గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం వద్ద యుద్ధ విమానాన్ని మోహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ చేసిన ప్రకటన ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ పరిణామాలతో గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ ఏ క్షణాన ఏ ప్రకటన చేస్తారో, ఏ చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవాలనే అమెరికా ఆశలను ఉద్దేశిస్తూ.. ఫ్రాన్స్ బహిరంగ విమర్శలు చేసింది. అమెరికా, కెనడా సంయుక్త రక్షణ సంస్థ అయిన 'నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్' తాజాగా గ్రీన్‌లాండ్‌కు సంబంధించి తమ సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. త్వరలోనే తమ సైనిక విమానం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు చేరుకుంటుందని అందులో వెల్లడించింది. ఈ ప్రాంతంలో రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన తమ దీర్ఘకాల ప్రణాళికల్లో భాగంగా ఈ మోహరింపు చేపట్టనున్నట్లు పేర్కొంది. కెనడా, డెన్మార్క్ రాజ్యం సమన్వయంతో ఈ కార్యకలాపాలు జరగనున్నాయని, గ్రీన్‌లాండ్ ప్రభుత్వానికి దీని గురించి ముందుగానే సమాచారం అందించామని నోరాడ్ తెలిపింది. అయితే దీనిపై డెన్మార్క్ నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు. అమెరికా దుందుడుకు చర్యల నేపథ్యంలో డెన్మార్క్ పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను గ్రీన్‌లాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. బలగాలు, సైనిక పరికరాలను మోసుకెళ్లిన అనేక విమానాలు సోమవారం గ్రీన్‌లాండ్‌కు చేరుకున్నాయని పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఎందుకు దృష్టిసారించారనే దానిపై అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భవిష్యత్తులో రష్యా నుంచి వచ్చే ముప్పు నుంచి కాపాడుకోవడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిపై ఫ్రాన్స్ విదేశాంగ శాఖ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు చేసింది. 'ఏదోఒక రోజు మంటలు చెలరేగితే.. అగ్నిమాపక సిబ్బంది రావాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పుడే ఇంటిని తగలెట్టేయడం మంచిది. ఏదో ఒకరోజు కారుకు ప్రమాదం జరిగితే నష్టం వాటిల్లుతుంది. కాబట్టి ఇప్పుడే కారుకు యాక్సిడెంట్ చేయడం మంచిదని అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. ఇక, గ్రీన్‌లాండ్ సాధించుకునేందుకు అగ్రరాజ్యం చేస్తున్న ప్రయత్నాలపై ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్యూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాలు ఈయూ, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య, ఆర్థిక సంబంధాలను ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు.

# శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసు

- విచారణలో దూకుడు పెంచిన ఈడీ
- మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు



**తిరువనంతపురం, జనవరి 20:** శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసుపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఇటీవల సుప్రీం కూడా ఈ ఏసుపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం మూడు రాష్ట్రాల్లోని 21 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేరళ, కర్ణాటక, తమిళనాడులలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావన్‌కోర్ దేవశ్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్‌లకు సంబంధం ఉన్న ప్రాంతాల్లోను, వారి సన్నిహితులకు సంబంధించిన ఇళ్లల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఈ కేసుపై కేరళ హైకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మరింత క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టడానికి బంగారు తాపడాల పునరుద్ధరణ పనుల్లో భాగమైన ఇతర అధికారులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇటీవల అరెస్టైన టీడీబీ మాజీ అధ్యక్షులు ఎ.పద్మకుమార్, మాజీ సభ్యుడు కె.పి.శంకరదాస్‌ల హయాంలోనే ఈ అక్రమాలకు బీజం పడిందన్నారు. శబరిమల ఆలయంలో ఆన్-సైట్ తనిఖీ చేయాలని కేరళ హైకోర్టు ఇటీవల సిట్ అధికారులను ఆదేశించింది. మరోవైపు ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని భక్తులు, పలువురు అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో ఆలయ ప్రధాన పూజారి సహా ఇప్పటివరకు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

# వీధి కుక్కలపై ఇచ్చిన తీర్పుపై విమర్శలు

## మేనకాగాంధీ తీరుపై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ, జనవరి 20:** కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ పై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వీధి శునకాలపై ఇచ్చిన తీర్పుపై మేనకా చేసిన విమర్శలను తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆమె కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని అభిప్రాయపడింది. వీధి శునకాల అంశంపై నేడు మరోసారి విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎటువంటి ఆలోచన లేకుండా కేంద్ర మాజీ మంత్రి అందరిపై అన్ని రకాల వ్యాఖ్యలు చేశారని మండిపడింది. కోర్టు ఆచితూచి వ్యవహరించాలని మీరు చెబుతున్నారు. కానీ, మీ క్లయింటు మేనకా గాంధీ ఎటువంటి వ్యాఖ్యలు చేశారో అడిగారా? ఆమె పాడ్‌క్యాస్ట్‌ను విన్నారా? ఆలోచన లేకుండా ప్రతి ఒక్కరిపై అన్ని రకాల వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో ఆమె తీరు గమనించారా? అని మేనకా గాంధీ తరపున సీనియర్ అడ్వేకేట్ రాజు రామచంద్రన్‌ను సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఆమె మాటలు కోర్టు ధిక్కారమే అయినప్పటికీ న్యాయస్థానం ఔన్నత్యం దృష్ట్యా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంది. వీధి శునకాల సమస్యను కట్టడిచేసేందుకు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆమె ఎంత బ్జడెట్ కేటాయించారని ఈ సందర్భంగా పిటిషనర్‌ను జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. శునకాలకు ఆహారం పెట్టేవారిని జవాబుదారీ చేయాలని తేలిగ్గా న్యాయస్థానం వ్యాఖ్యానించలేదని, సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అలా చెప్పామన్నారు.

# ప్రభుత్వం జారీ చేసిన జీవోలను అమలు చేయాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే డిగ్రీ రద్దు, రాయితీలను వడ్డీతో సహా వసూలు చేస్తాం
- ప్రైవేట్ రంగానికి వెళ్లిన 57 మంది వైద్యులకు నోటీసులు
- గ్రామీణ ప్రాంతాలు, జాతరల్లో హెచ్ఐవీ అవగాహన కార్యక్రమాలు విస్తరించాలి
- అధ్యక్షులు శ్రీధర్ యాదవ్




**నేటి సాక్షి । తిరుపతి:** ప్రభుత్వం జారీ చేసిన జీవోలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్నదాన్ని పర్యవేక్షించడమే శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ప్రధాన ఉద్దేశమని ఆ కమిటీ ఛైర్పర్సన్ శ్రీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం తిరుపతి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖలపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, అసిస్టెంట్ సెక్రటరీ మరియు కమిటీ ఇంచార్జ్ విశ్వనాథం, ఏపీఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠ రెడ్డి తదితరులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కీలక అంశాలను వెల్లడించారు. ఈ సమావేశంలో జీవో నంబర్ 85, 127, 311ల అమలుపై మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో పీజీ పూర్తి చేసిన వైద్యులు తప్పనిసరిగా ప్రభుత్వ సేవలకే కట్టుబడి ప్రజలకు సేవ చేయాలన్నదే ఈ జీవోల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అధికారులు వివరించగా, జీవో నెం.85లోని అంశాలకు అనుగుణంగా తరువాత జీవో నెం.127లో కొన్ని సవరణలు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇన్-సర్వీస్ అభ్యర్థులకు 30 శాతం రిజర్వేషన్ అంశంలో మార్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ రంగానికి వెళ్లిన వైద్యులపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు కమిటీకి వివరించారని, ఇప్పటివరకు 57 మంది వైద్యులకు నోటీసులు జారీ చేయగా, కొందరి వద్ద నుంచి రికవరీ ప్రక్రియ కూడా ప్రారంభమైందని ఛైర్పర్సన్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే డిగ్రీ రద్దు, ప్రభుత్వం ఇచ్చిన రాయితీలను వడ్డీతో సహా వసూలు చేయడం, అవసరమైతే రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలు లేకపోవడం వల్ల కొంతమంది ఎంబీబీఎస్ వైద్యులకు అవకాశాలు కల్పించలేని పరిస్థితి ఉందని, ఈ అంశంపై ప్రభుత్వం మరొకసారి అధ్యయనం చేసి కమిటీ ద్వారా తగిన నిర్ణయాలు తీసుకోవాలని సభ్యులు అభిప్రాయపడ్డారని తెలిపారు. సమావేశంలో హెచ్ఐవీ అవగాహన అంశంపైనా విస్తృతంగా చర్చ జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో హెచ్ఐవీ కేసులు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలు, జాతరలు జరిగే ప్రాంతాల్లో మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని కమిటీ సభ్యులు సూచించారని తెలిపారు. హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌ను మరింత మందికి విస్తరించాలని కూడా అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై మరోసారి కమిటీ సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేయనున్నట్లు ఛైర్పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సభ్యులు పీలేరు, సింగనమల, నగిరి, సత్తెనపల్లి, కావలి ఎమ్మెల్యేలు, కిషోర్ కుమార్ రెడ్డి, శ్రావణి, గాలి భాను ప్రకాష్, కన్నా లక్ష్మీనారాయణ, వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, డీఎంఈ రఘునందన్, డీపీఎచ్ అండ్ ఎఫ్ డబ్ల్యూ డా. పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, డీఎం అండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్, స్విమ్స్ ప్రిన్సిపల్ డా. రవి ప్రభు, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాధా, శ్రీ పద్మావతి మహిళా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఉషా కళావత్, ఇతర వైద్య అధికారులు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేషంట్ ఎగ్జామినేషన్‌లో నిర్లక్ష్యం వద్దు





- ఏఐఎంఎస్ఆర్ క్లినికల్ మీటింగ్‌లో అసోసియేట్ డీన్ డా. రమ్యా రామకృష్ణన్

**నేటి సాక్షి తిరుపతి చిత్తూరు:** చిత్తూరులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో మంగళవారం క్లినికల్ మీటింగ్‌ను నిర్వహించారు. జిల్లా ఆసుపత్రి (డీహెచ్‌హెచ్)లోని క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యారామకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్యా రామకృష్ణన్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు పేషంట్ ఎగ్జామినేషన్‌ను అత్యంత శ్రద్ధతో, శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. క్లినికల్ కేసులపై రూట్ క్రాస్ అనాలసిస్ నిర్వహించి, సంబంధిత అన్ని విభాగాల అభిప్రాయాలను సమన్వయంతో పరిశీలించినప్పుడే సరైన నిర్ధారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఇలాంటి క్లినికల్ మీటింగ్‌ల ద్వారా విద్యార్థుల్లో ప్రాయోగిక నైపుణ్యాలు, బాధ్యతాయుత వైద్య ధోరణి, మెడికో-లీగల్ అవగాహన మరింత పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఆప్తాల్మాలజీ (కంటి వైద్యం) విభాగం తరఫున "లెన్స్ డ్రివెన్ క్రైసిస్ - నొప్పి, ఒత్తిడి, దృష్టిపై ప్రభావం" అనే అంశంపై పీజీ విద్యార్థిని డా. గాయత్రి ఉపన్యాసం ఇచ్చారు. లెన్స్‌కు సంబంధించిన సమస్యల వల్ల కంటి నొప్పి, కంటి ఒత్తిడి పెరగడం, దృష్టి దెబ్బతినే పరిస్థితులను క్లినికల్ కేసుల ఆధారంగా ఆమె వివరించారు. కంటి వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం ఎంత కీలకమో ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ సెషన్‌కు ఆప్తాల్మాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. యామిని ప్రదీశా మోడరేటర్‌గా వ్యవహరించగా, విభాగాధిపతి ప్రొఫెసర్ డా. కుమార్ అమృత్ అధ్యక్షత వహించారు. అదేవిధంగా ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం తరఫున "ఫీటల్ డెవలప్‌మెంట్ అండ్ మెడికో-లీగల్ అంశాలు" అనే అంశంపై విభాగాధిపతి డా. కె. శ్రీనివాసులు ఉపన్యాసం ఇచ్చారు. భ్రూణ అభివృద్ధి దశలు, వాటికి సంబంధించిన వైద్య-న్యాయ పరమైన అంశాలు, చట్టపరమైన నిబంధనలను విద్యార్థులకు ఆయన స్పష్టంగా వివరించారు. వైద్యులు తమ వృత్తి నిర్వహణలో న్యాయపరమైన బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ క్లినికల్ మీటింగ్‌ను క్లినికల్ మీటింగ్స్ కోఆర్డినేటర్ డా. వి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆప్తాల్మాలజీ మరియు ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల విభాగాధిపతులు, ఎంబీబీఎస్ విద్యార్థులు, పీజీ విద్యార్థులు, ఇంటర్న్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలి



- కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ
- టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా
- తపస్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్

**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులశీదరూ నిర్విరామ కృషి చేయాల్సి ఉంటుందని కరీంనగర్ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు ఎల్. రమణ అన్నారు. జగిత్యాల జిల్లా ఉపాధ్యాయ భవనంలో జిల్లా విద్యాధికారి కె రాము, తపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్, దంతవైద్యులు రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

**ఈ సందర్భంగా డి ఈ ఓ రామ్ మాట్లాడుతూ**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యులు విద్యార్థుల భవితను తీర్చిదిద్దడంలో ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలోనూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలోనూ తపస్ సభ్యుల కృషి ప్రశంసనీయమన్నారు.

**తపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ**

పిఆర్సి, డిఏల వంటి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. టీచర్ల ఎదుర్కొంటున్నా సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తానని పేర్కొన్నారు. తపస్ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకోసం శ్రమిస్తుందని రాజశేఖర్ తెలిపారు. నూతనంగా ఎన్నికైనటువంటి జిల్లా బాధ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బోయిన్పల్లి ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తపస్ ముందుంటుందన్నారు. తపస్ రాష్ట్ర బాధ్యులు అయిల్నేని నరేందర్ రావు, గడ్డం మహిపాల్ రెడ్డి, భోనగిరి దేవయ్య, వీరమల్ల వెంకటరమణరావు తదితరులు ప్రశంగించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన ఎలిగేటి.రాజేంద్రప్రసాద్, మల్హార్ రావు, మహేశ్వర శర్మ తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు , వివిధ మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు, తపస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కన్యకా పరమేశ్వరి ఆత్మహర్పణ






**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** మండల కేంద్రమైన చౌడేపల్లి లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, ఉదయాన్నే ఆర్యవైశ్యుల నుంచి ప్రతి ఒక్కరూ పాలను తెచ్చి స్వయంగా అమ్మవారిని అభిషేకించారు, అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు సాయంత్రం లలితా మహిళా మండలి ఆధ్వర్యంలో సహస్ర కుంకుమార్చన కలశ ఉద్వాసన అమ్మవారికి మహా మంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు, వాసవి సేవా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మార్పణ దినోత్సవం లో పట్టణంలోని ఆర్యవైశ్య ప్రముఖులు మహిళలు పాల్గొన్నారు

## 108లో ఉద్యోగ అవకాశం




**నేటి సాక్షి న్యూస్ చౌడేపలి:** చిత్తూరు జిల్లాలోని 108 అంబులెన్స్ అత్యవసర సర్వీసెస్లో పైలట్(డ్రైవర్)పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని 108 జిల్లా మేనేజర్ మోహన్ బాబు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ జగదీష్ మనోజ్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు పదవ తరగతి చదివి ఉండి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ బ్యాడ్జి కలిగి ఉండాలని 35 సంవత్సరాల లోపు ఉన్న వ్యక్తులు అర్హులన్నారు ఆసక్తిగల వ్యక్తులు ఈనెల 21 22 తేదీలలో డీఎంహెచ్వో కార్యాలయం ఓల్డ్ మెటర్నరీ హాస్పిటల్ మున్సిపల్ ఆఫీస్ పక్కన అలిపిరి రోడ్డు తిరుపతి లో హాజరుకావాలని వారు కోరారు

## వన్యప్రాణుల గణన ప్రారంభం



**నేటి సాక్షి జగిత్యాల(గుండ ప్రశాంత్ గౌడ్):** ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్-2026లో భాగంగా మంగళవారం ధర్మపురి అటవీ రేంజ్ పరిధిలోని పెగడపల్లి మండలం ల్యాగలమర్రి సెక్షన్‌లో వన్యప్రాణుల గణన కార్యక్రమం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ వన్యప్రాణుల గణనను ఈ నెల 20 నుంచి 25 వరకు ఉదయం, సాయంత్రం రోజుకు రెండు దఫాలుగా చేపట్టనున్నట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీరయ్య తెలిపారు. మొదటి మూడు రోజుల పాటు శాఖాహార జంతువులకు సంబంధించి ట్రాన్సెక్ట్ లైన్ సర్వే నిర్వహించి, రెండు కిలోమీటర్ల పరిధిలో వన్యప్రాణుల సమాచారం సేకరిస్తామని తెలిపారు. అనంతరం మూడు రోజుల పాటు మాంసాహార జంతువులకు సంబంధించి ట్రైల్ లైన్ సర్వే చేపట్టి, ఐదు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వన్యప్రాణుల పాదముద్రలు, విసర్జితాలు, వెంటికలు, చెట్లపై గీసిన గీతలు, భూమిపై పొర్లిన అచ్చులు తదితర గుర్తులను ఎం-స్ట్రైప్స్ ఎకాలాజికల్ యాప్లో నమోదు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది రాజేందర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యంకు కృషి..

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...**





**నేటిసాక్షి చందుర్తి (సతీష్):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగవారం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొబైల్ ఎక్స్ రే ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ టిబి ముక్త బారత్ లో భాగంగా 24 లక్షతో మొబైల్ ఎక్స్ రే ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నార ప్రజా ఆరోగ్య లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని గుర్తింపు పొందిన టీబీ రోగులకు మొబైల్ ఎక్స్ రే ద్వారా ఆయా ప్రాంతాల్లో వైద్యం అందించేందుకు వారి ఇంటికి వెళ్లి వారికి వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోకి వెళ్లి టీబీ రోగులను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు సూచించారు.. నూతన టెక్నాలజీ ద్వారా వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు..టీబీ నిర్ధాన అయితే వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరు నెలలలు ఉచిత మందులను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు.. వేములవాడలోని వంద పడకల ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.. చందుర్తి మండలం కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని త్వరలోనే రుద్రంగి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వ ఆసుపత్రులలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | బుధవారం 21 జనవరి 2026

# రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక



**నేటి సాక్షి నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలో ఉన్న కొండాపురం ఎస్టీ గురుకుల పాఠశాల (పీఎం శ్రీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం) విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో నిజామాబాద్ జిల్లాలో జరగనున్న 69వ ఎస్‌జీఎఫ్ (బా+బా) రాష్ట్రస్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీలకు, గురుకుల పాఠశాల నుంచి 9వ తరగతి విద్యార్థులు ఉదయ్ కుమార్, ఓంకార్, సైదులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఎంపికపై కళాశాల ప్రిన్సిపాల్ రాజారామ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సాంబియా నాయక్, కోచ్ డాక్టర్ రామ్మోహన్ గౌడ్, పీఈటీ ఆంజనేయులుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

# తాగునీటి పైప్లైన్ లీకేజీలు



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ ):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామంలోని ప్రభుత్వ కస్తూరిబా గురుకుల పాఠశాలకు వెళ్లే తాగునీటి పైప్లైన్ వంపు మార్గాన లీకేజీ కావడం జరిగిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇట్టి తాగునీరు పాఠశాలకు చేరుతుందని గ్రామస్తులు వివరించారు. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పాఠశాల సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా పసుపుల గ్రామ పంచాయితీ అధికారులు స్పందించి పైప్ లైన్ లీకేజీలను సరిచేయాలని పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక




**నేటిసాక్షి, కరీంనగర్:** కరీంనగర్‌లోని విజయనగర్ కాలనీకి చెందిన అబ్దుల్ హమీద్ మంగళవారం దాదాపు 100 మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యులు అంజన్ కుమార్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ మడుపు మోహన్ అబ్దుల్ హమీద్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినారు. అబ్దుల్ హమీద్ గత ఏడు సంవత్సరాల నుండి విజయనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త కార్యదర్శిగా పనిచేయడంతో పాటు కాలనీ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించడం, యువతను ఉపాధి వైపు నడిపించడం, యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతూ డివిజన్ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ హమీద్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అబ్దుల్ హమీద్ 34వ డివిజన్ నుండి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తూ అంజన్ కుమార్‌కు దరఖాస్తు సమర్పించినారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో అహ్మద్ మహమ్మద్, షేక్ మహమూద్, హఫీజ్ ముజ్జు, ఇర్షద్ యాకూబ్, ఖాజిం, సుమీర్, ముజాహిద్, రవూఫ్, తాజ్, అన్సర్ ఒజామా, అపర్ణ, సంతోష్, వెంకటేష్, రాజు, రాజయ్య తదితరులు ఉన్నారు.


# తరతరాలుగా ఉన్న దారి ఆక్రమణ

## అనాధీనం భూమి ఆక్రమణ



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** మండలంలోని దుర్గసముద్రం గ్రామపంచాయతీ, దుర్గసముద్రం యస్సీకాలనీలో వినాయకుడు నుండి మారెమ్మ గుడి వరకు దారి తరతరాలుగా గత యాభై సంవత్సరాలనుండి ఉన్నది. సదరు దారిని గ్రామానికి చెందిన ఊసన్న అలియాస్ కీరమంద వెంకట్రమణ అనువ్యక్తి ఆక్రమించుకొని, దారి పూర్తిగా మూసివేయడం జరిగింది. అక్కడ గతంలో బండిబాట ఉండేది. ఐతే ప్రస్తుతం కాలినడక మాత్రమే ఉంది. ఎవరైనా దారి విషయమై అడిగితే ఇది మా సెటిల్మెంట్ భూమి అని, మేము దారి వదిలే ప్రసక్తిలేదని అందరినీ బెదిరింపులకు గురిచేస్తున్నాడు. అతని ఆధీనం ప్రభుత్వ ఆనాధీనం భూమి కొంత ఉందని దానిని దారికి ఒదలాల్సిందిగా గ్రామస్తులు ఎన్నిసార్లు తెలియజేసిననూ ఆయన నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, వెంటనే రెవిన్యూ అధికారులు సదరు అనాధీనం భూమిని స్వాధీనం చేసుకొని, గ్రామం నుండి మారెమ్మ గుడికి దారిసౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరడమైనది. వెంటనే సంబందించిన అధికారులు తక్షణమే సర్వే నిర్వహించి, దారి చూపి, ప్రభుత్వ భూమిని స్వాధిన పరుకోవాలని వారు అన్నారు.

# పోరుదీక్షకు బయలుదేరిన ఉద్యమ కళాకారులు



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** తెలంగాణ ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ దరువు అంజన్న, అనోజ్ వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్ పిలుపు మేరకు కళాకారుల జిల్లా అధ్యక్షులు పందిరి సైదులు, కార్యదర్శి కలకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యమ కళాకారులు మంగళవారం హైదరాబాద్ బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వెంటనే వారికి సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా, ఉద్యమ కళాకారులకు ఇళ్ల స్థలాలు కూడా పంపిణీ చేయాలనే డిమాండ్ తో పోరు దీక్షకు బయలుదేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి రెమడాల శ్రీనివాస్, కందుకూరి సుదర్శన్, నకిరేకంటి వేణు, ఎస్ సత్యనారాయణ, ఎమ్ యల్లయ్య, కందుల సైదులు, వంగూరి శ్రీనివాస్, మధు, మహేష్, కంచి శ్రీనివాస్, చిత్రం అశోక్, వల్లంపట్ల అబ్రహం, అంకెపాక కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

# బహుజన బిడ్డ విజయం గ్రామమంతా గర్వం!



- కరాటేలో డిస్ట్రిక్ట్ ఫస్ట్ సాధించిన కొమ్ము ప్రగతికి ఘన సన్మానం

**నేటి సాక్షి , మహబూబాబాద్(భూక్యా రవి నాయక్) :** నరసింహుల పేట మండలం పెద్ద నాగారం గ్రామం మహారాజుల కాలనీకి చెందిన బహుజన బిడ్డ కొమ్ము ప్రగతి కరాటేలో ప్రతిభను చాటుతూ డిస్ట్రిక్ట్ ఫస్ట్ సాధించడం గ్రామానికి అపారమైన గర్వకారణంగా మారింది. వరంగల్ టీఎస్ మహిళ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీలో చదువుకుంటున్న ప్రగతి, చదువుతో పాటు క్రీడల్లోనూ తన సత్తాను నిరూపించి యువతకు ఆదర్శంగా నిలిచింది. సామాజిక వెనుకబాటును అధిగమించి పట్టుదల, క్రమశిక్షణతో ఈ స్థాయికి చేరుకోవడం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని గ్రామ పెద్దలు కొనియాడారు. ప్రగతి సాధించిన ఈ విజయం వల్ల పెద్ద నాగారం గ్రామ పేరు జిల్లా వ్యాప్తంగా మార్మోగిందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కొమ్ము ప్రగతిని ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నవారు: గుజి వీరస్వామి (టీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు), కొమ్ము మధుకర్ (ఫోటో స్టూడియో), గాడుదుల కొమురవెల్లి, గంట రాములు, కొమ్ము వీరభద్రం, కొమ్ము ఉపేందర్, కొమ్ము రఫీ, చలమల్ల పవన్ గౌడ్, చలమల్ల నరేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కొమ్ము ఎల్లయ్య, కర్నే శ్రీకాంత్, గంట మహేష్, బింగి విక్రమ్ గౌడ్, గుజి వెంకన్న, జంపాల ఉపేందర్, పులిచింత అమృత రెడ్డి, గంట కొమురెల్లి, సప్పిడి జయపాల్ రెడ్డి, కొమ్ము మహేందర్, గులగట్టు రమేష్, తుడుసు సతీష్, మందుల రమేష్ తదితరులు ఉన్నారు. గ్రామానికి కీర్తి తీసుకొచ్చిన కొమ్ము ప్రగతికి గ్రామ ప్రజలంతా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నక్ష రీసర్వే పనులు వేగవంతం చేయాలి

- ప్రజా పిర్యాదులు సంతృప్తికరంగా పరిష్కరించాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశాలు



**నేటి సాక్షి, తిరుపతి:** నక్ష (రీసర్వే) పనులను వేగవంతం చేయాలని, ప్రజల నుంచి వచ్చిన పిర్యాదులను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నక్ష (రీసర్వే) కార్యక్రమం, ప్రజా పిర్యాదుల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతిపై అన్ని విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలతో పాటు ప్రభుత్వ ఆస్తుల ఖచ్చితమైన హద్దులను నిర్ణయించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నక్షా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ప్రాంతాల్లో ఇప్పటికే రీసర్వే పూర్తయిందని పేర్కొన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల సర్వే నిర్వహించి వాటి సరిహద్దులను ఖరారు చేసే ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఇప్పటికే సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి, అవసరమైన పరికరాలు సమకూర్చినప్పటికీ పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని అధికారులను ప్రశ్నించారు.

## సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారానికి అవకాశం

ఈ రీసర్వే ద్వారా ఆస్తుల సరిహద్దులకు సంబంధించిన వివాదాలను శాశ్వతంగా పరిష్కరించుకునేందుకు ఇదొక మంచి అవకాశమని, ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని కమిషనర్ కోరారు. సర్వే సమయంలో సచివాలయ సిబ్బంది వచ్చినప్పుడు ఆస్తుల డాక్యుమెంట్ల నకళ్లు అందించి సహకరించాలని తెలిపారు.

## ప్రజా పిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజల నుంచి వచ్చిన పిర్యాదులను ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం కాని పిర్యాదులపై పిర్యాదుదారులను ప్రత్యక్షంగా కలిసి వివరాలు తెలియజేయాలని సూచించారు.

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని, ఆయా వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు, సిబ్బంది తరచుగా పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధులకు హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

నగరపాలక సంస్థకు రావాల్సిన పన్నులను వసూలు చేయడంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఖచ్చితమైన ఆస్తుల రికార్డుల నమోదు కోసం ప్రజలు పూర్తిగా సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ ఖాన్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీఈలు, ఏసీపీలు, సర్వేయర్ కోటేశ్వరరావు, అన్ని విభాగాల కార్యదర్శులు, విఆర్ఓలు పాల్గొన్నారు.

# స్వదేశీ సంకల్ప పరుగు నిర్వహణ అభినందనీయం




- శ్రీ సరస్వతి శిశు మందిర్ ఆధ్వర్యంలో 2కే రన్

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం ఉదయం 'స్వదేశీ సంకల్ప పరుగు – 2కే రన్'నిర్వహించారు.

## స్వదేశీ వస్తు వినియోగంపై అవగాహన కలిగిఉండాలి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ స్వీతీ అనూప్ మాట్లాడుతూ, నేటి దేశ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వినియోగించాల్సిన అవసరం ఎంతగానో ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా సరస్వతి శిశు మందిర్ వారు స్వదేశీ సంకల్ప పరుగు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. స్వదేశీ వస్తువుల వినియోగం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, ప్రతి పౌరుడు దేశాభివృద్ధిలో భాగస్వామిగా మారాలని ఆమె పిలుపునిచ్చారు.

## గర్వకారణంగా స్వదేశీ సంకల్ప పరుగు

పాఠశాల ప్రబంధ కారిణి అధ్యక్షులు డాక్టర్ వేముల రవి కిరణ్ మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి ఎదగడంలో స్వదేశీ వస్తువుల వినియోగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వివేకానంద స్వామి జయంతి, సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఈ స్వదేశీ సంకల్ప పరుగు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఒడ్నాల నరేష్, ప్రబంధ కారిణి కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, కోశాధికారి నీలి శ్రీనివాస్, సమితి ఉపాధ్యక్ష కార్యదర్శులు వడ్లకొండ రాజ గంగాధర్, చెట్లపల్లి శంకర్, ప్రబంధ కారిణి సభ్యులు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానాచార్యులు గోపు వెంకటేష్, ఆచార్య బృందం, పోషకులు, విద్యార్థినీ–విద్యార్థులు కలిపి సుమారు 250 మంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI



# తిలక్ వర్మ ప్లేస్‌లో ఆడేది ఎవరు?

**నేటినుండి విండీస్‌తో**
**భారత్ తొలి టీ20 మ్యాచ్**
**జట్టులో కొన్ని కీలక మార్పులకు అవకాశం**
**జట్టులోకి రానున్న శ్రేయస్ అయ్యర్**



వన్డే సిరీస్‌ను కోల్పోయిన కసిలో ఉన్న టీమిండియా, ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో కివీస్‌ను దెబ్బకొట్టేందుకు సిద్ధమైంది. నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం వేదికగా బుధవారం (జనవరి 21) రాత్రి 7 గంటలకు తొలి టీ20 మ్యాచ్ ప్రారంభం కానుంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్టులో కొన్ని కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ గాయం కారణంగా ఈ సిరీస్‌లోని మొదటి మూడు మ్యాచ్‌లకు దూరం కావడం భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ. అతనికి ఆపరేషన్ జరగడంతో, అతని స్థానంలో వెటరన్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులోకి తీసుకున్నారు. అయితే, టీ20 వరల్డ్ కప్ 2026 జట్టులో ఉన్న ఇషాన్ కిషన్ కూడా రేసులో ఉన్నాడు. సుదీర్ఘ కాలం తర్వాత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్‌ను మిడిల్ ఆర్డర్‌లో ఆడిస్తారా లేక శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. అయ్యర్ ప్రస్తుతం వరల్డ్ కప్ జట్టులో లేనందున, బ్యాకప్ ప్లేయర్‌గా అతన్ని పరీక్షించే అవకాశం ఉంది. ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో కలిసి సంజూ శాంసన్ వచ్చే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బాధ్యతలతో పాటు ఓపెనర్‌గా సంజూ తన మార్క్ చూపించాల్సి ఉంది. వన్డేల్లో వైఫల్యాలు చవిచూసిన సూర్యకుమార్ యాదవ్, తనకు ఇష్టమైన టీ20 ఫార్మాట్‌లో మళ్ళీ ఫామ్ అందుకోవాలని చూస్తున్నాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శివం దూబేలు జట్టుకు బలాన్ని ఇస్తున్నారు. ఇక ఫినిషర్ పాత్రలో రింకూ సింగ్ మరోసారి తన పవర్ చూపించడానికి సిద్ధమయ్యాడు. బౌలింగ్ విషయానికి వస్తే.. జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు పేస్ బాధ్యతలు మోయనున్నారు. నాగ్‌పూర్ పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది కాబట్టి, వరుణ్ చక్రవర్తి ప్రధాన స్పిన్నర్‌గా బరిలోకి దిగడం ఖాయం. మరో స్పిన్ ఆప్షన్‌గా రవి బిష్ణోయ్ లేదా కుల్దీప్ యాదవ్‌లలో ఒకరిని ఎంచుకోవాల్సి ఉంటుంది. వన్డే సిరీస్ కోల్పోయిన భారత్, ఈ టీ20 సిరీస్‌ను విజయంతో ప్రారంభించి వరల్డ్ కప్ ముందర ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని భావిస్తోంది.



# జడేజా వన్డేల్లో రిటైర్మెంట్ తీసుకుంటున్నాడా?

భారత్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా ఉన్న రవీంద్ర జడేజా కెరీర్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్టు కనిపిస్తోంది. గత దశాబ్దం కాలంగా మూడు ఫార్మాట్‌లలో టీమ్ ఇండియాకు వెన్నెముకగా నిలిచిన ఈ సౌరాష్ట్రస్టార్ తాజాగా తన రిటైర్మెంట్‌పై చేసిన వ్యాఖ్య సంచలనంగా మారుతున్నాయి. ఇటివల న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో జడేజా ప్రదర్శనఆశించిన స్థాయిలో లేదు. ఆల్‌రౌండర్‌గా జట్టులో తన ప్రాధాన్యతను నిరూపించుకోవాల్సిన చోట ఆయన విఫలమయ్యాడు. మూడు మ్యాచ్‌ల్లో కలిపి కనీసం ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడం, అలాగే బ్యాటింగ్‌లో మూడు ఇన్నింగ్స్‌లు ఆడి కనీసం 30 పరుగులు కూడా చేయలేకపోవడం అభిమానులను, విశ్లేషకులను విస్మయానికి గురి చేసింది. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒక వీడియో విపరీతంగా వైరల్ అవుతుంది. అందులో రవీంద్ర జడేజా, వికెట్ కీపర్ బ్యాట్ రిషబ్ పంత్ ఒక కార్యక్రమంలో పాల్గొని సరదాగా ముచ్చటించారు. ఆ సమయంలో వారిద్దరినీ మీరు ఎప్పుడైనా సినిమాల్లో నటించాలని అనుకున్నారా అని ప్రశ్నించగా పంత్ సమాధానమిస్తూ.... నేను ఇంకా దాని గురించి ఆలోచించలేదు. నన్ను క్రికెట్ ఆడనివ్వండి, జడేజా భాయ్ గురించి నాకు తెలియదు. అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి జడేజా స్పందిస్తూ నవ్వుతూనే ఒక బాంబు పేల్చారు. అంటే నా సమయం అయిపోయిందని పరోక్షంగా చెబుతున్నాడు అని జడేజా వ్యాఖ్యానించారు. పైకి ఇది నవ్వుతూ అన్న మాట అయినప్పటికీ అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రస్థానం ముగింపు దశకు చేరుకుదని సంకేతాన్ని ఆయన ఇచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే 2024 టీ 20 ప్రపంచ కప్ తర్వాత జడేజా టీ 20 ఇంటర్నేషనల ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అతను ప్రస్తుతం ఆయన కేవలం టెస్టు, వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. జడేజా తర్వాత వాషింగ్టన్ సుందర్ లేదా అక్షర్ పటేల్‌లలో ఒకరు వన్డేలలో అతని స్థానంలో రావచ్చు. అయితే, ఇద్దరు ఆటగాళ్లు చాలా కాలంగా భారతదేశం కోసం వన్డే క్రికెట్ ఆడుతున్నారు. అక్షర్ ఇప్పటివరకు 71 వన్డేలు, వాషింగ్టన్ 29 వన్డే మ్యాచ్‌లు ఆడారు.

## జడేజా కోహ్లిని చూసి నేర్చుకోవాలి: అశ్విన్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తరహాలో జడేజా తన ఆటను మెరుగుపర్చుకోవాలని సూచించాడు. ఆటలో కొత్త ప్రయోగాలు చేయాలని జడేజాకు తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, కానీ అతను తన బౌలింగ్ శైలిని మార్చుకోడని చెప్పాడు. కొన్నేళ్లుగా బ్యాటింగ్, బౌలింగ్‌లో నిలకడగా రాణిస్తుండటంతోనే జడేజా ఇలా మొండిగా తయారయ్యాడని తెలిపాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో జడేజా దారుణంగా విఫలమయ్యాడు. బ్యాటింగ్‌లో తీవ్రంగా నిరాశపర్చిన జడేజా బౌలింగ్‌లో ఒకే ఒక్క వికెట్ తీసాడు. ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం టీమిండియా విజయవకాశాలను ప్రభావితం చేసింది. ఈ సిరీస్‌లో 2 1తో భారత్ ఘోర పరాజయం చవిచూసింది. ఈ క్రమంలోనే తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా జడేజా గురించి మాట్లాడిన అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'జడేజాకు తాను నమ్మే కొన్ని బలాలు ఉన్నాయి. అతను తన బలాలకు మించి ఏమి చేయడు. కాస్త నెమ్మదిగా.. భిన్నంగా బౌలింగ్ చేయాలని సూచించినా పట్టించుకోడు. ఎందుకంటే జడేజా తన బలాలను నమ్ముకొనే బౌలింగ్ చేస్తాడు. అతని బలాలే కొన్నిసార్లు బలహీనతలుగా మారుతున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లో అతనికి ఉన్న నైపుణ్యం అసాధారణం. కానీ కొత్త ప్రయోగాలు చేయడు. నెట్స్‌లో క్యారమ్ బాల్స్ వేస్తాడు, కానీ మ్యాచ్‌లో మాత్రం ప్రయత్నించడు. లెజెండ్ అయిన జడేజాకు కోల్పోయేదేమీ లేదు. కొంచెం ఫంకీగా ఆడితే చూడాలని ఉంది. అతను నిరూపించుకోవాల్సింది కూడా ఏం లేదు. ఎప్పటికీ జడేజా దిగ్గజమే. విరాట్ కోహ్లీలా జడేజా కూడా తన ఆటను మెరుగుపర్చుకోవాలి. కోహ్లీ ప్రస్తుతం ఎలాంటి చింత లేకుండా ఆడుతున్నాడు. ఈ ప్రపంచానికి తానే రాజును అన్నట్లు ఆటను ఆస్వాదిస్తున్నాడు. అందుకే అతను ఇంత బాగా రాణిస్తున్నాడు. జడేజాకు ఇది సవాల్‌తో కూడిన సమయం. అక్షర్ పటేల్ అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. జడేజా వన్డేల్లో ఎన్నో గొప్ప ప్రదర్శనలు చేశాడు. కానీ ఇప్పుడు చర్చంతా అతని బ్యాటింగ్ చుట్టూనే తిరుగుతోంది. స్పిన్నర్లపై తక్కువ స్ట్రైక్ రేట్ గురించి మాట్లాడుతున్నారు. అయితే ఇప్పుడే ఎవరి భవిష్యత్తుపై తీర్పు ఇవ్వడం తొందరపాటు అవుతుంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

# ఫ్యాన్స్‌ను నిరాశపరుస్తున్న గంభీర్ కోచింగ్




టాలెంటెడ్ ఆటగాళ్లు, ఎంతో అనుభవం ఉన్న సీనియర్లతో కళకళలాడే భారత జట్టుకు ఇప్పుడు కాలం కలిసి రావడం లేదు. ముఖ్యంగా గౌతమ్ గంభీర్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి టీమచవతీతీచండియా ఊహించని రీతిలో ఘోరమైన ఓటములను చవిచూస్తోంది. మొన్న ఆదివారం ఇండోర్‌లో జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్ చేతిలో 41 పరుగుల తేడాతో ఓడిపోవడమే దీనికి నిదర్శనం. విరాట్ కోహ్లీ సెంచరీతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. గంభీర్ హయాంలో భారత్ ఎదుర్కొన్న ఆ 5 చేదు జ్ఞాపకాలు ఏంటి అనే వివరాల్లోకి వెళితే..టీమచవతీతీచండియా చరిత్రలోనే న్యూజిలాండ్ జట్టు మన దేశానికి వచ్చి వన్డే సిరీస్ గెలవడం ఇదే మొదటిసారి. అంతకుముందు 1988 నుంచి 2023 వరకు కివీస్ టీమ్ భారత్‌లో ఏడు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడితే ఏడింటిలోనూ ఓడిపోయింది. కానీ ఈసారి మాత్రం వారు 2–1తో సిరీస్‌ను కైవసం చేసుకుని గంభీర్ కోచింగ్‌లో భారత్‌కు మొదటి దారుణమైన పరాభవాన్ని మిగిల్చారు. అసలు ఇలాంటి రీతిలో సిరీస్ చేజారుతుందని ఎవరూ ఊహించలేదు. జట్టు మంచి ఫామ్‌లో ఉన్నట్లు అనిపిస్తున్నా ఫలితం మాత్రం దారుణంగా ఉంటోంది. నవంబర్ 2024లో న్యూజిలాండ్ జట్టు భారత్‌లో మూడు టెస్టుల సిరీస్‌ను 3–0తో క్లీన్ స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. కనీసం మూడు మ్యాచులు ఉన్న టెస్ట్ సిరీస్‌లో భారత్ తన సొంత గడ్డపై వైట్‌వాష్ అవ్వడం ఇదే తొలిసారి. బెంగళూరులో జరిగిన తొలి టెస్టులో భారత్ కేవలం 46 పరుగులకే ఆలౌట్ అవ్వడం కూడా గంభీర్ హయాంలోనే జరిగింది. టాప్ ప్లేయర్స్ అందరూ ఒకేసారి ఫామ్ కోల్పోవడం కూడా పెద్ద షాక్ అనే చెప్పాలి. బ్యాటింగ్ లైనప్‌లో క్లారిటీ లేకపోవడం ఈ పరాభవానికి ప్రధాన కారణమని కొందరు సీనియర్లు కామెంట్ చేశారు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన రెండు ఎడిషన్లలోనూ భారత్ ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. కానీ గంభీర్ కోచ్‌గా ఉన్నఈ సమయంలో 2027 డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దాదాపు దూరమైంది. న్యూజిలాండ్‌తో జరిగిన 3–0 ఓటమి, ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ కోల్పోవడం వల్ల భారత్ ఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి. ఇప్పుడు డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో 48.15 పాయింట్ పర్సెంటేజీతో ఆరో స్థానంలో ఉంది. ఇకపై భారత్ ఇంకా తొమ్మిది టెస్టులు (శ్రీలంకతో 2, న్యూజిలాండ్‌తో 2, ఆస్ట్రేలియాతో 5) ఆడాల్సి ఉంది. ఈ సిరీస్‌ల్లో వరుస విజయాలు నమోదు చేస్తే 74.07 పర్సెంటేజీకి చేరుకుంటుంది. అప్పుడు ఫైనల్ చేరేందుకు అవకాశాలు ఉంటాయి. కానీ ఇది జరగడం అంత సులభం కాదు! అయితే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌కు డిమాండ్ పెరుగుతున్న క్రమంలో టీమచవతీతీచండియా నుంచి ఇలాంటి ప్రదర్శన ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. ఆగస్టు 2024లో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 2–0తో కోల్పోయింది. గత 27 ఏళ్లలో శ్రీలంక చేతిలో భారత్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ ఓడిపోవడం ఇదే మొదటిసారి. అంతకుముందు 1997లో శ్రీలంక చేతిలో ఓడిపోయిన భారత్, ఆ తర్వాత వరుసగా 13 సిరీస్‌లలో ఓటమి లేకుండా దూసుకుపోయింది. కానీ గంభీర్ రాకతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది. శ్రీలంక ఇతర చిన్న జట్లతో ఓడిపోతున్న సమయంలో భారత్‌ను ఓడించడం పెద్ద షాక్ అనే చెప్పాలి. గడిచిన పదేళ్లలో భారత్ ఒక్కసారి కూడా ఆస్ట్రేలియా చేతిలో బోర్డర్ గావస్కర్ ట్రోఫీని కోల్పోలేదు. 2018–19 అలాగే 2020–21 లో ఆస్ట్రేలియా గడ్డపైనే వారిని ఓడించి వరుసగా నాలుగుసార్లు ట్రోఫీని నిలబెట్టుకుంది. అయితే 2024–25 లో గంభీర్ కోచింగ్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్ 3–1తో సిరీస్‌ను కోల్పోయి, పదేళ్ల తర్వాత ట్రోఫీని ప్రత్యర్థికి అప్పగించింది. గంభీర్ కోచ్‌గా వచ్చిన తర్వాత జట్టులో ఆ దూకుడు తగ్గిందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ ఐదు ఘోర పరాభవాలు కూడా జట్టుపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. మరి రాబోయే టీ20 వరల్డ్ కప్, వన్డే వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీల్లోనైనా టీమచవతీతీచండియా ఈ చేదు జ్ఞాపకాలను చెరిపేస్తుందో లేదో వేచి చూడాలి.

# గంభీర్ తప్పిదం వల్లే ఘోర ఓటమి

**వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనాలోచిత నిర్ణయాల కారణంగానే న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయం ఎదురైందని వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే అన్నాడు. జట్టులో తరుచూ మార్పులు చేయడం టీమిండియా ఓటమిని శాసించిందని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 2–1తో టీమిండియా కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ గెలిచిన టీమిండియా.. తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. 38 ఏళ్ల తర్వాత భారత గడ్డపై న్యూజిలాండ్ తొలి వన్డే సిరీస్ గెలిచింది. ఈ పరాజయం నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు మేనేజ్‌మెంట్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ పరాజయంపై మాట్లాడిన రహానే.. టీమిండియా ఓటములపై బరాబర్ ప్రశ్నలు వస్తాయని తెలిపాడు. 'జట్టు ప్రదర్శనపై కచ్చితంగా కఠినమైన ప్రశ్నలు ఎదురవుతాయి. భారత్ గత 9 వన్డేల్లో ఐదు ఓడిపోయింది. అందుకు కారణం.. జట్టులో అతిగా మార్పులు చేయడం. అందుకే మేనేజ్‌మెంట్ నుంచి ఆటగాళ్లకు తమ స్థానాలపై భరోసా కావాలని చెబుతున్నా. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలకు సిద్దమవుతున్నప్పుడు మేనేజ్‌మెంట్ నుంచి ఆటగాళ్లకు భద్రతతో పాటు స్పష్టత అవసరం. ఒక నిర్దిష్ట ఫార్మాట్‌లో కొందరు ఆటగాళ్లను ఆడించాలనుకున్నప్పుడు.. ఆ విషయంలో వారికి స్పష్టత ఉండాలి. ఓటములు ఎదురైనప్పుడు ప్రశ్నలు వస్తాయి. అది చాలా సహజం. ఎందుకంటే అభిమానులు భారత క్రికెట్‌తో అంతగా ముడిపడి ఉంటారు. భారత బాగా ఆడాలని, మ్యాచ్ గెలవాలని, సిరీస్ గెలవాలని కోరుకుంటారు. ముఖ్యంగా భారత్‌లో ఆడుతున్నప్పుడు ఓటమిని ఏ మాత్రం సహించరు. న్యూజిలాండ్‌ది ఏ టీమ్? బీ టీమ్ కావచ్చు. కానీ భారత్ సునాయసంగా 3–0తో ఈ సిరీస్ గెలుస్తుందని అంతా భావించాం. భారత జట్టుపై అంతలా అంచనాలు ఉన్నాయి. కానీ న్యూజిలాండ్ ఆడిన తీరు అద్భుతం. భారత్ కేవలం ప్రక్రియను నమ్ముకోవాలి. మరో ఆరు నెలల వరకు భారత్‌కు వన్డే సిరీస్ లేదు. జట్టును తిరిగి సిద్దం చేసుకోవడానికి మేనేజ్‌మెంట్ ఈ సమయాన్ని ఉపయోగించుకోవాలి. టీ20 ప్రపంచకప్ తర్వాత కూడా ఖాళీ సమయం లభించనుంది. సరైన ఆటగాళ్లను ఎంచుకోవడంతో పాటు కాంబినేషన్‌ను కనుగోవడం, ఆటగాళ్లకు మద్దతుగా నిలవడం కీలకం.'అని రహానే చెప్పుకొచ్చాడు.

# స్టేడియంలో చెలరేగిన మంటలు.. ప్రాణభయంతో పరుగులు తీసిన జనం!



ఆస్ట్రేలియాలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ మ్యాచ్‌లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మంగళవారం (జనవరి 20) పెర్త్ వేదికగా పెర్త్ స్కార్చర్స్, సిడ్నీ సిక్సర్స్ మధ్య క్వాలిఫైయర్ మ్యాచ్ జరుగుతుండగా, స్టేడియంలోని ఒక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెర్త్ ఆప్టస్ స్టేడియం భవనానికి బయటి వైపు ఉన్న ఒక గది నుంచి నల్లటి పొగ భారీగా ఆకాశంలోకి వ్యాపించడంతో స్టేడియంలో ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలోనే ఈ ఘటన జరగడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో పెర్త్ స్కార్చర్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో స్టేడియం భవనం నుంచి పొగ రావడం టీవీ స్క్రీన్లపై స్పష్టంగా కనిపించింది. వెంటనే అప్రమత్తమైన స్టేడియం సెక్యూరిటీ సిబ్బంది, అగ్నిమాపక దళం అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదం స్టేడియం బయటి గదిలో జరగడంతో ప్రాణనష్టం తప్పింది. ఆటగాళ్లకు లేదా ప్రేక్షకులకు ఎటువంటి హాని కలగలేదు. కాసేపు గందరగోళం నెలకొన్నప్పటికీ, మంటలు అదుపులోకి రావడంతో మ్యాచ్‌ను యథావిధిగా కొనసాగించారు. అయితే, ఇటీవల సౌతాఫ్రికాలో జరిగిన ఎూ20 మ్యాచ్ సందర్భంగా స్టేడియం పార్కింగ్‌లో మంటలు రావడం, ఇప్పుడు బిగ్ బాష్‌లో ఇలా జరగడం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. మ్యాచ్ విషయానికి వస్తే.. ఈ క్వాలిఫైయర్ పోరులో పెర్త్ స్కార్చర్స్ బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. ఓపెనర్ ఫిన్ అలెన్ 30 బంతుల్లో 49 పరుగులతో మెరుపులు మెరిపించినప్పటికీ, మిగిలిన వారు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. కెప్టెన్ ఆష్టన్ టర్నర్ 29 పరుగులు చేయగా, పర్త్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 147 పరుగులు మాత్రమే చేయగలిగింది. సిడ్నీ సిక్సర్స్ బౌలర్లు మిచెల్ స్టార్క్, బెన్ డ్వార్షుయిస్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పర్త్ జట్టును కట్టడి చేశారు. స్టేడియంలో మంటల టెన్షన్ ఉన్నప్పటికీ, మైదానంలో ఆట మాత్రం రసవత్తరంగా సాగింది.

# ఆలోచింప చేసే అద్భుత సినిమా దండోరా

## సినిమాను చూసి మెచ్చుకున్న ఎన్టీఆర్





తెలుగులో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు ప్రశంసలు అందుకున్న 'దండోరా' సినిమాపై అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసల వర్షం కురిపించాడు . ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇది ఎంతో లోతైన, శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే చిత్రం. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవిలు తమ నటనతో సినిమా ఆద్యంతం అద్భుతంగా రాణించారు. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్. ఇలాంటి గొప్ప ప్రయత్నాన్ని ప్రోత్సహించి, నిర్మించిన రవీంద్ర బెనర్జీ గారికి అభినందనలు. ఈ గొప్ప చిత్రంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అంటూ జూనియర్ ఎన్టీఆర్ రాసుకొచ్చాడు. అయితే ఎన్టీఆర్ లాంటి గ్లోబల్ స్టార్ నుంచి ప్రశంసలు అందడంతో చిత్ర యూనిట్ అమితానందంలో మునిగిపోయింది. 'ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు, ఇది నాకు చాలు' అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి లోనవ్వగా, నిర్మాత ఇది తమకు అసలైన విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ సినిమాకు ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ పెరగడమే కాకుండా, ప్రస్తుతం ఇండియాలో అమెజాన్ ప్రైమ్ టాప్-2లో ట్రెండింగ్‌లో నిలుస్తూ రికార్డు సృష్టిస్తోంది.


# బాబీ దర్శకత్వంలో చిరు తదుపరి సినిమా



ఓవైపు థియేటర్లలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్ర సందడి కొనసాగుతుండగా.. మరోవైపు చిరంజీవి తదుపరి చిత్ర పనులు చకచకా సాగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా మొదలు కానుంది. మార్చి నుంచి చిరు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పుడీ చిత్ర కథాంశానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది కూతురి సెంటిమెంట్‌తో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. దీంట్లో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో అలరిస్తారని.. ఈ కథలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

# దృశ్యం-3 కోసం వెంకటేశ్ బిజీ

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్‌బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ 'దృశ్యం 3' కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ 'దృశ్యం 3'తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు. ఇక ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.





# విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా

## హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు





తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్స్ట్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ÷-లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మారుతి తదుపరి ప్రాజెక్ట్‌పై ఊహాగానాలు



టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మారుతి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు, ప్రభాస్‌తో చేసిన ప్రతిష్టాత్మక చిత్రం 'రాజా సాబ్' అనంతరం ఆయన తదుపరి ప్రాజెక్టుల గురించి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై తాజాగా ఒక స్పష్టత వచ్చింది, నిజానికి గత కొన్ని రోజులుగా మారుతి ఒక మెగా హీరోతో సినిమా చేయబోతున్నారని, స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయ్యాయని కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. దీనికి తోడు కొన్ని నిర్మాణ సంస్థల పేర్లు, నిర్మాతల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి, ఈ ప్రచారం కాస్తా వైరల్ కావడంతో అభిమానుల్లో అయోమయం నెలకొంది.తాజా సమాచారం ప్రకారం, మారుతి తదుపరి సినిమా గురించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్తలన్నీ కేవలం పుకార్లు మాత్రమే, అవి పూర్తిగా నిరాధారమైనవని, అందులో ఎటువంటి వాస్తవం లేదని ఆయన పీఆర్ టీమ్ ప్రకటించింది, కేవలం క్లిక్ బైట్స్ కోసం లేదా అంచనాల కోసం సృష్టించిన వార్తలుగా వీటిని పరిగణించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. మారుతి తన ప్రతి ప్రాజెక్టును చాలా ప్లాన్డ్‌గా అనౌన్స్ చేస్తుంటారు, ఒకవేళ తన తదుపరి సినిమా ఖరారైతే, ఆ వివరాలను ఆయన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా, సంబంధిత నిర్మాణ సంస్థల అధికారిక ప్రకటనల ద్వారా వెల్లడిస్తారు అని పేర్కొన్నారు. అనధికారిక మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని షేర్ చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని మారుతి సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

# స్టన్నింగ్ లుక్‌లో సెగలు పుట్టిస్తున్న రాశీ ఖన్నా!

రాశీ ఖన్నా.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. యువత ఫేవరెట్ హీరోయిన్ గా పేరు దక్కించుకున్న ఈ సుందరి.. తొలిసారి 2013లో విడుదలైన 'మద్రాస్ కెఫే' అనే అని హిందీ చిత్రంలో భారత ఇంటెలిజెన్స్ అధికారి విక్రమ్ సింగ్ భార్య రూబీ సింగ్ పాత్ర ద్వారా సినీ రంగా ప్రవేశం చేసింది. రూబీ సింగ్ పాత్రలో నటించడానికి ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకుంది రాశి ఖన్నా. తెలుగులో తొలిసారి అక్కినేని ఫ్యామిలీ ప్రెస్టేజియస్ మూవీగా నిలిచిన 'మనం' సినిమాలో చిన్న పాత్ర పోషించి తెలుగు తెరకు పరిచయ-ఎమైంది. ఈ ఒక్క పాత్ర ఈమెకు హీరోయిన్గా అవకాశం అందేలా చేసింది. అలా తొలిసారి 'ఊహలు గుసగుసలాడే' అనే సినిమాలో శ్రీ సాయి శిరీష ప్రభావతి అనే పాత్ర పోషించి తన నటనతో అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా హీరోయిన్గా మంచి పేరు దక్కించుకుంది.. ఈ సినిమా తర్వాత వరుసగా జోరు, జిల్, శివం, బెంగాల్ టైగర్, సుప్రీం , హైపర్ , జై లవకుశ, రాజా ది గ్రేట్, శ్రీనివాస కళ్యాణం ఇలా పలు తెలుగు చిత్రాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఇటు తెలుగులోనే కాకుండా అటు తమిళ్లో కూడా వరుస సినిమాలు చేసి మెప్పించింది. ఇకపోతే వరుసగా చిత్రాలు చేస్తోంది కానీ స్టార్ హీరోయిన్ రేంజ్ లో అవకాశాలు అయితే లభించడం లేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. ఇందులో శ్రీలీల మరో హీరోయిన్గా నటిస్తున్న విషయం తెలిసిందే.. మరోవైపు మరో తెలుగు చిత్రంలో నటిస్తున్న ఈమె అటు హిందీ ' నాగ్జిల్లా: నాగ్ లోక్ కా పెహ్లాకాండ్' అనే హిందీ సినిమాలో కూడా నటిస్తోంది. అంతేకాదు విక్రాంత్ మాస్సే హీరోగా నటిస్తున్న ఒక హిందీ సినిమాలో కూడా అవకాశం దక్కించుకుంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. అలాగే హిందీ వెబ్ సిరీస్ ఫర్జీ 2 లో కూడా రాశిఖన్నా నటిస్తోంది. షాహిద్ కపూర్ తో కలిసి ఈ సీక్వెల్ లో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. అంతేకాదు ఆర్ మాధవన్ తో కలిసి ఒక టైం ట్రావెల్ మూవీ చేస్తున్న ఈమె ఒక పంజాబీ వెబ్ సిరీస్ లో కూడా నటిస్తోంది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# భట్టి విక్రమార్క సభకు పకడ్బందీ ఏర్పాట్లు



- సభా స్థలాన్ని పరిశీలించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్, ఎస్పీ

**నేటి సాక్షి - జగిత్యాల (రాధారపు నర్సయ్య):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం జగిత్యాలలో పాల్గొననున్న సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా పోలీస్ అధికారి అశోక్ కుమార్‌లతో కలిసి సభా స్థలాన్ని మంత్రి పరిశీలించారు. సభా వేదిక, విద్యుత్ సరఫరా, ధ్వని వ్యవస్థతో పాటు ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, నీడ సదుపాయాలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని సూచించారు.

### భద్రతకు ప్రాధాన్యం

భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

### సమన్వయంతో విజయవంతం చేయాలి

ప్రభుత్వ ప్రతిష్ఠకు తగిన విధంగా సభ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. సభను సజావుగా, శాంతియుతంగా విజయవంతం చేయడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎమ్మార్వో, ఎంపిడివోతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి

**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** దేవస్థానాలు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బోయకొండ మాజీ చైర్మన్ ఎస్కె వెంకటరమణారెడ్డి అన్నారు, మండలంలోని ఏ కొత్తకోటలో అగస్తీశ్వర స్వామి ఆలయ సందర్శన అయిన తర్వాత ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వ రథసారథి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ బిజెపి నాయకులు రాష్ట్రంలో దైవ చింతన పెంపొందించే కార్యక్రమంలో భాగంగా అనేక కార్యక్రమాలు తలపెడుతున్నారన్నారు . అందులో భాగంగానే టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు రూ 10 నుంచి 30 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు, ఏ ముఖ్యమంత్రి ఇలాంటి చర్యలు చేపట్టలేదని గతంలో టీటీడీ ఆధ్వర్యంలో వైష్ణవ ఆలయాలకు మాత్రమే నిధులు కేటాయించే వారిని ప్రస్తుతం అన్ని ఆలయాలకు అనుమతి లభించింది అన్నారు తనకు అవకాశం వస్తే పుంగనూరు



నియోజకవర్గంలోని దేవస్థానాలన్నీ ఆధునికరించి వాడవాడలా నూతన దేవస్థానాలు నిర్మిస్తే ఎలా చర్యలు తీసుకుంటానని ఆయన ఈ సందర్భంగా అన్నారు అనంతరం క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు పుంగనూరు నానా సాబ్ పేటకు చెందిన ఓం శక్తి మాలధారణ వేసుకున్న భక్తులకు ఇరుముడి సమయంలో దారి ఖర్చులకు గాను ఆయన ఆర్థిక సాయం చేశారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జల్లి మనోహర మల్లాపురం నరేష్ జనసేన నాయకుడు హరి తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



- కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**నేటి సాక్షి - జగిత్యాల( రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లాలో జరగనున్న ఐదు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.

### కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారి అశోక్ కుమార్‌తో కలిసి కౌంటింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. కౌంటింగ్ హాళ్లు, బ్యారికేడ్లు, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల అమరిక, స్ట్రాంగ్ రూములు, ప్రవేశ–నిష్క్రమణ మార్గాలను వివరంగా పరిశీలించారు.

### మార్గదర్శకాలు పాటించాలి

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి లోపాలకు అవకాశం లేకుండా చూడాలని తెలిపారు.

### భద్రతపై ప్రత్యేక దృష్టి

కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ఏజెంట్లు, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

### అధికారుల సమన్వయం అవసరం

ఎన్నికల కౌంటింగ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జగిత్యాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో ముగ్గురు ఎస్ఐల బదిలీలు





- మూడు పోలీస్ స్టేషన్లలో సబ్ ఇన్‌స్పెక్టర్ల స్థానమార్పులు
- జగిత్యాల జిల్లా ఎస్పీ ఉత్తర్వులు

తక్షణమే బాధ్యతలు చేపట్టిన ఇబ్రహీంపట్నం-మల్లాపూర్ ఎస్ఐలు

**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య)** జగిత్యాల జిల్లాలో పోలీసు పరిపాలనలో భాగంగా సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు, పోస్టింగ్‌లు చేపట్టారు. డీఐజీ, జోన్–II బసరా నిజామాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని జిల్లా ఎస్పీ కార్యాలయం వెల్లడించింది. ఈ మేరకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ (ఎస్‌హెచ్‌ఓ)గా పనిచేస్తున్న ఏ.అనిల్‌ను మల్లాపూర్ పీఎస్‌కు బదిలీ చేశారు. కథలాపూర్ పీఎస్‌లో ఎస్ఐగా ఉన్న జి.నవీన్‌కుమార్‌ను ఇబ్రహీంపట్నం పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. అలాగే మల్లాపూర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న కోసన రాజును జగిత్యాల జిల్లా సీసీఎస్ లో ఖాళీగా ఉన్న పోస్టులో నియమించారు. ఈ బదిలీలకు సంబంధించి ఆయా అధికారులు రిలీవ్, రిపోర్ట్ తేదీలను జిల్లా పోలీస్ కార్యాలయానికి తెలియజేయాలని మెట్ పల్లి, కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు మరియు జగిత్యాల సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌కు జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల ప్రకారం కథలాపూర్ నుంచి బదిలీపై వచ్చిన నవీన్ కుమార్ ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ లో.. ఇబ్రహీంపట్నం నుంచి బదిలీపై వెళ్లిన ఎస్ఐ అనిల్ మల్లాపూర్ పోలీసు స్టేషన్ లో తక్షణమే ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

# మానసిక బలం కావాలి

### ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు

### మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ గంప నాగేశ్వరరావు.



**నేటి సాక్షి తిరుపతి:** ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ గంప నాగేశ్వరరావు తిరుపతికి విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్లలో పోలీసు సిబ్బందికి ట్రైనింగ్ మరియు మోటివేషనల్ స్పీకింగ్ క్లాసులు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డాక్టర్ గంప నాగేశ్వరరావును ఆహ్వానించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, మంగళవారం తిరుపతిలోని కళ్యాణ్ డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న పోలీసులకు డాక్టర్ గంప నాగేశ్వరరావు అద్భుతమైన ట్రైనింగ్ సెషన్ మరియు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించేలా ఆయన ప్రసంగించారు. డాక్టర్ గంప నాగేశ్వరరావును కలిసేందుకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు తిరుపతి, చిత్తూరు, కడప తదితర ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన ట్రైనర్స్ అందరినీ కలసి, ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. పరీక్షల ఒత్తిడితో పిల్లలు డిప్రెషన్, యాంగ్జైటీ వంటి మానసిక సమస్యలను ఎదుర్కొంటారని, కొన్నిసార్లు అవే ఆత్మహత్యలకు దారితీస్తాయని, అలాంటి పరిస్థితుల్లో వారికి మానసిక బలం అందించడం చాలా అవసరమని ఆయన తెలిపారు. అందుకే ప్రతి ట్రైనర్ తమ ప్రాంతంలోని పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్ తహసునిసా బేగం, ముఖేష్, డాక్టర్ శ్రీధర్ విఠలం, రత్న శేఖర్, లక్ష్మీప్రసాద్, నాగిరెడ్డి తదితరులు, వివిధ క్లబ్బుల ప్రెసిడెంట్లు మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరాం

### ప్రారంభించిన గ్రామ సర్పంచ్ తిరుపతి

### వెటరినరీ డాక్టర్స్ డాక్టర్ రవీందర్ అశోక్



**నేటి సాక్షి, జగిత్యాల (గుండ ప్రశాంత్ గౌడ్):** గొల్లపల్లి మండలం బిబి రాజు పల్లెలో పశుసంవర్ధక శాఖ పశు గణన అభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ తిరుపతి.వెటరినరీ డాక్టర్స్ డాక్టర్ రవీందర్, డాక్టర్ అశోక్ పశువులకు గర్భ కోశ చికిత్స చేసి రైతులకు మందులు అందించినారు వారు మాట్లాడుతూ పాడి రైతులు పశు సంతతి పెంచుకోవడం కోసం పశువులకు గర్భకోశ చికిత్స చేయించుకోవాలి ఎదకు రాని పశువులకు తగిన మందులు వాడుకోవాలి అన్నారు పశు గణన అభివృద్ధి సంస్థ జిల్లా సూపర్వైజర్ నరసయ్య మాట్లాడుతూ శీతాకాలంలో పశువులు ఏదకు వస్తాయి గనుక పశువైద్యశిబ్బందిచే, గోపాల మిత్రులచే కృత్రిమ గర్భాదారణ చేయించుకుంటే మేలు జాతి రకపు దూడలు జన్మిస్తాయి, జన్మించిన దూడలకు 15 రోజుల నుండి నట్టల నివారణ మందును త్రాగించడం వలన దూడలు ఆరోగ్యంగా ఉంటాయి ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంధ్యారాణి వార్డు సభ్యులు పశు వైద్య సిబ్బంది రాజశ్రీ నిశాంత్ నరసయ్య, గోపాల మిత్రులు శ్రీకాంత్ రవీందర్ పాల్గొన్నారు

# బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి




**నేటి సాక్షి గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్ ):** గన్నేరువరం నుండి కరీంనగర్ వరకు లోయర్ మానే డ్యాం పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం గన్నేరువరం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు బ్రిడ్జి నిర్మాణం కొరకు కేంద్రం ప్రభుత్వం 77 కోట్లు మంజూరు చేసి నెలలు గడుస్తున్న ఇప్పటివరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన కూడా చేయలేదని మండిపడ్డారు హామీలు ఇచ్చుడే తప్ప అమలు చేయడం లేదన్నారు వెంటనే బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి నిర్మాణం పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు లేనియెడల పెద్ద పెద్ద ఎత్తున నాలుగు మండలా ప్రజలతో కలిసి రాజీవ్ రహదారిపై ధర్నా చేపడతామని హెచ్చరించారు

## సాగునీరు విడుదల చేయాలి...

**నీటిపారుదల శాఖ అధికారులకు వినతి**



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్) :** నారాయణపేట నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ కార్యాలయానికి భారతీయ కిసాన్ సాంగ్ ఆధ్వర్యంలో పల్లాపూర్లు నారాయణపేట కొండారెడ్డిపల్లి చెరువు నీరు విడుదల చేయాలి ఆయకట్టు రైతులకు ఎస్కే పంట వరి సాగు ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారికి వినతి పత్రం ద్వారా సమాచారం ఇవ్వడం జరిగింది అదేవిధంగా చెరువు కట్ట నీరటి కావలి గారు ఇంతవరకు లేనందున నీరటి కావాలి కారణం పంపగలరని కోరడం జరుగుతున్నది ఇట్టి విషయాన్ని గతంలో కూడా తాసిల్దార్‌కి, నీటిపారుదల ఇంజనీరింగ్ అధికారి గారికి సూచన చేయడం జరిగింది ఇందులో పాల్గొన్నవారు. నగర అధ్యక్షులు ఆకుల వెంకటప్ప నగర కార్యదర్శి అంజయ్య యాదవ్ జిల్లా కార్యదర్శి అనంత్ రెడ్డి పట్టణ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి కురువ మల్లేష్ నిరటి నరసింహులు బండి మల్ రెడ్డి శాసమూల బాలప్ప తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులా సంఘం ఏకగ్రీవ ఎన్నిక





నేటి సాక్షి- మేడిపల్లి : మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో 17 బీసీ కులాల సంయుక్త బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా శ్రీపతి దామోదర్, ఉపాధ్యక్షులుగా బిరుదు రాజు అశోక్, కార్యదర్శి గా బక్క శెట్టి రాజారెడ్డి, క్యాషియర్ గా మాదాసు రవి, రైటర్ గా కట్ట రమేష్ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా బెజ్జారపు అనిల్ కుమార్, ని ఎన్నుకున్నారు నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి బీసీ కులాల క్షేమ సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## పట్ట పగలే దొంగల బీభత్సం

**నేటి సాక్షి- మెట్‌పల్లి (దామ రాజేష్):** మెట్టుపల్లి పట్టణంలో రాంనగర్ కాలనీలో గల దోబీ ఘాట్ వద్ద దొంగలు బీభత్సం సృష్టించారు బట్టలు ఉతుకుతున్న వృద్ధురాలిపై దాడి చేసి అడ్డువచ్చిన కొడుకు పై కూడా దాడి చేసి వృద్ధురాలి మెడ నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు.వృద్ధురాలికి ఆమె కొడుకు తీవ్ర రక్త గాయాలవగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగల కోసం గాలింపు ముమ్మారం చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు పట్టణంలో పట్టపగలే దాడి జరగడంతో కాలనీవాసులు పట్టణ ప్రజలు ఒక్కసారి భయభ్రాంతులకు గురయ్యారు

## కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



**నేటి సాక్షి - మెట్‌పల్లి(దామ రాజేష్):** ఈరోజు మల్లాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో చండీ హోమం నిర్వహించినారు. 5 హోమ గుండాలలో దాదాపు 50 జంటలు సతి సమేతంగా చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమ అశ్విన్ కుమార్ చేతుల మీదుగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో నూనె శ్రీనివాస్, చౌడారపు శ్రీనివాస్, నూనె అంజనేయులు, మైలారపు నరేష్, శివరామ కిషన్ గుప్తా,చింత శశిధర్, కంటాల భూమయ్య, తదితరులు పాల్గొన్నారు

# మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తున్నది...

- **చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య...**

నేటి సాక్షి, శంకర్ పల్లి; రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎంతో చేయూతనిస్తున్నదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం శంకర్ పల్లి పట్టణంలోని ఎంపిడిఓ సమావేశ మందిరంలో శంకర్ పల్లి పట్టణానికి, మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన .65,07,540/- (రూపాయలు అరవైఐదులక్షల ఏడువేల ఐదువందల నలభై)లి విలువ గల లి65 కళ్యాణ లక్ష్మీ / షాదీ ముబారక్‌లి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం శంకర్ పల్లి పట్టణానికి, మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన లి=ం.7,09,000/- (రూపాయలు ఏడులక్షల తొమ్మిదివేలు)లి విలువ గల లి14 చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెప్పారు. వారు బస్సులో ఉచితంగా తిరగడానికి మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టారని తెలిపారు. పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం చేస్తున్నదని తెలిపారు. అలాగే ఆర్థిక స్తోమత లేని వారికి చికిత్సకై సీఎంఆర్ పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వై. ప్రకాష్ గుప్తా, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డి. వెంకట్ రెడ్డి, తహసిల్దార్ సురేందర్, ఎంపీడీవో వెంకయ్య గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజాభిప్రాయ సేకరణతో ప్రజలపై భారం

- **పేదల గుడిసెలకు తక్షణమే విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలి**
- **స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలి**

**సిపిఐ**



**నేటి సాక్షి । తిరుపతి:** రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సి) ఆధ్వర్యంలో జరుగుతున్న బూటకపు ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజలపై అధిక భారం మోపొద్దని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రామానాయుడు డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఏపీఈఆర్సి సమావేశంలో కమిషన్ చైర్మన్‌కు అనేక సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిపిఐ నాయకత్వం సమర్పించింది. దీనికి ముందు ఎస్పీడీసీఎల్ కార్యాలయం గేటు ఎదుట సిపిఐ-సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, విద్యుత్ చార్జీలు పెంచవద్దు, స్మార్ట్ మీటర్లు బిగించవద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏ. రామానాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోడీ విధానాలను అనుసరిస్తూ ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా విద్యుత్ చార్జీలు, సర్చార్జీలు పెంచుతూ, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై మరింత భారం మోపేందుకు బూటకపు ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టారని తీవ్రంగా విమర్శించారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే, "విద్యుత్ చార్జీలు పెంచుతున్నాం, స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నాం - మీ అభిప్రాయం చెప్పండి" అంటూ నేరుగా ప్రజలను ప్రశ్నించే ధైర్యం ఉందా అని చంద్రబాబు నాయుడిని ప్రశ్నించారు. ఏపీఈఆర్సి సమావేశాలు ఏసీ హాళ్లలో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్ల వద్ద నిర్వహించి నిజమైన ప్రజాభిప్రాయం తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తున్నారని విమర్శించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన అనేక మంది నిరుపేదలు గుడిసెల్లో నివసిస్తున్నప్పటికీ, వారికి ఇప్పటికీ విద్యుత్ మీటర్లు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేదలందరికీ విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీకి, విద్యుత్ శాఖ మంత్రికి, ఇతర అధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేదని మండిపడ్డారు. రైతులు ట్రాన్స్ఫార్మర్ల కోసం పెట్టుకున్న అనేక దరఖాస్తులు కూడా పెండింగ్‌లోనే ఉండిపోయాయని, ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానమని విమర్శించారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేసి, గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలందరికీ విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీఈఆర్సి ప్రజాభిప్రాయ సేకరణ చైర్మన్ స్పందిస్తూ, ప్రస్తుతం విద్యుత్ చార్జీలు పెంచబోమని, గతంలో విధించిన సర్చార్జీలు ఫిబ్రవరి వరకు మాత్రమే ఉంటాయని, పేదల గృహాలకు విద్యుత్ మీటర్లు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శులు టి. జనార్దన్, కె. శివారెడ్డి, తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె. రాధాకృష్ణ, నగర కార్యదర్శి జె. విశ్వనాథ్, నగర కార్యవర్గ సభ్యులు వి. ఉదయ్ కుమార్, కె. పద్మనాభ రెడ్డి, ఎన్. శ్రీరాములు, అలాగే సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జయ చంద్ర, వేణుగోపాల్, జిబిఎస్ సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భక్తులను ఆకట్టుకున్న శివ పురాణ ప్రవచనం

- **గుట్ట రాజేశుని సన్నిధిలో ప్రారంభమైన బ్రహ్మశ్రీ భాస్కరశర్మ ప్రవచనం**



**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లా కేంద్రం గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో శివ మహా పురాణ ప్రవచనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.భాగవత సప్తాహ ప్రవచన కర్త,అభినవ శుక, భాగవత భాస్కర బిరుదాంకితులు బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మచే శ్రీ శివ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం జగిత్యాలలో మంగళవారం ఘనంగా ప్రారంభమై ఈనెల 28 వరకు కొనసాగనున్నది.గుట్టపై రాజేశ్వర స్వామిని దర్శించుకున్న భాస్కర శర్మ ప్రత్యేక పూజలు చేసి, వ్యాస పీఠం ముందు ఆశీనులై భక్తులకు శివ పురాణంలోని అనేక ఘట్టాలను అత్యద్భుతంగా వివరిస్తుంటే శ్రోతలు మంత్రముగ్ధులయ్యారు ప్రతి ఒక్కరు శివమహా పురాణం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

శివుడు అభిషేక ప్రియుడని చెబుతూ శివ మహాపురాణం గురించి చక్కగా వివరించారు. కార్యక్రమం అనంతరం భక్తులకుఅన్న ప్రసాదం అందించారు. అన్న ప్రసాద సేవలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బట్టు రాజేందర్ ఆధ్వర్యంలో సభ్యులు సేవలందించారు. ఈ శివ మహాపురాణం ఈనెల 28వరకు జరుగుతుందని, ప్రతి రోజు ఉదయం 9.30 నిమిషాల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవచనం ఉంటుందని కార్యక్రమా నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గుంటి జగదీశ్వర్, కార్యక్రమ నిర్వాహకులు నరేందుల అమర్,ఊటూరి భాస్కర్, ఊటూరి లక్ష్మీనరసింహారావు, ఊటూరి వేణుగోపాల్, కొత్తపెల్లి శ్రీనివాస్, ఊటూరి శ్రీనివాస్, ఊటురి ప్రసాద్, ఊటూరి మహేష్, ఊటూరి నాగభూషణం, ఊటూరి హరీష్, ఉటూరి హరిత,స్వప్న, జానకి, లక్ష్మి, ఉటూరి శ్రీనాథ్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్చి చివరి వరకు కేసీకి నీటిని విడుదల చేయాలి

- సమాచారం లేకుండా అర్ధాంతరంగా నీళ్లు బంద్ చేయడం తగదు
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు డిమాండ్





**నేటి సాక్షి, జూపాడుబంగ్లా:** నందికొట్కూరు నియోజకవర్గంలో కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు అధికంగా ఉన్నారని, రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా కాలువ నీటిని నిలిపివేయడం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీ కెనాల్‌కు మార్చి చివరి వరకు సాగునీరు విడుదల చేయాలని, లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నందికొట్కూరు నియోజకవర్గంలో కేసీ కెనాల్ పరిధిలో వందల ఎకరాల్లో ఎండకారు వరి సాగు చేస్తున్నారని, ఇప్పటికే నారు బాగా పెరిగి నాటు దశకు చేరుకున్న సమయంలో కాలువల్లో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కనీసం కాలువల్లో నీరు ప్రవహించని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మార్చి చివరి వరకు నీటిని విడుదల చేయాలని, కానీ అధికారులు పేపర్ ప్రకటనలు గానీ, రైతులకు ముందస్తు సమాచారం గానీ ఇవ్వకుండా నీటిని నిలిపివేయడం వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. రెండు పంటల సాగుకు అనుకూలంగా పక్కనే కృష్ణా నది నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కేసీ కెనాల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని విమర్శించారు. రైతులు కాలువల వెంట రాత్రింబగళ్లు నీటి కోసం ఎదురుచూస్తున్నారని, జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని కేసీ కెనాల్ ఆయకట్టుకు మార్చి చివరి వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మాగబుల్ బాషా, సలీం, పుల్లయ్య, రమణ, సలాం, నారాయణ, రఫీ, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

# మారిన రిజర్వేషన్లు పక్క వార్డుల్లోకి పరుగులు



**నేటి సాక్షి మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా చెన్నూర్ పురపాలక సంఘాలకు సంబందించిన ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుకుంది నామినేషన్ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది అనుకున్నట్లుగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు వెలువడ్డాయి. అందులో భాగంగా చెన్నూర్ మున్సిపల్ రిజర్వేషన్లపై స్పష్టత వచ్చింది. చెన్నూర్ మున్సిపాలిటీ లో 18 వార్డులో రిజర్వేషన్లు ప్రకటించారు ఒక్కసారిగా చెన్నూర్ లో రిజర్వేషన్ ప్రటకనతో ఇన్ని రోజులుగా ఆ వార్డులో పోటీ చేస్తామని ప్రచారంచేస్తున్న ఆశవాహుల ఆశలు ఒక్కసారిగా ఆవిరి అయిపోయాయి,

## అంచనాలు తలకిందులు

చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో రిజర్వేషన్ల కేటాయింపుతో అంతా తలకిందులుగా మారినట్లయింది. గత 3.4 సంవత్సరాలు గా ఆశలు పెట్టుకున్న నాయకులకు కలిసిరానట్లయింది. తమకే రిజర్వేషన్ వస్తుందనుకొని ధీమాగా ఉన్న రాజకీయ నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. రిజర్వేషన్లు ఒకసాదిగా తలకిందులు కావడంతో ఆయా వార్డుల్లో పోటీ చేద్దామని భావించిన నాయకుల్లో అయోమయం నెలకొంది తమ రాజకీయ భవితవ్యం ఎలా అనేది సందిగ్ధంలో పడ్డారు

- అయోమయంలో ఆశావహులు

## పక్క వార్డులకు పరుగో పరుగు

చెన్నూర్ మున్సిపల్ వార్డు పోటీలో ఉన్నామని భావనతో ఉన్నప్పటికీ అటువంటి వార్డులోనూ పూర్తి భిన్నంగా రిజర్వేషన్లు వచ్చాయి. దీంతో తమ వార్డు కాకుండా పక్క వార్డులో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి పరుగులు పెట్టే పరిస్థితుల్లో ఉన్నారు, ఈ సారి ఎలాగైనా గెలవాలని అన్ని విధాలుగా రంగం సిద్ధం చేసుకున్నారు ఇప్పుడు రిజర్వేషన్ అనుకూలంగా లేకపోవడంతో పక్క వార్డుల్లో పట్టు కోసం ప్రయత్నం చేస్తున్నారు, పోటీలో నిల్చునే కౌన్సిలర్లకు అయోమయ పరిస్థితి నెలకొంది. అయితే వారి వ్యక్తిగత బలాలు, మారిన రాజకీయ రిజర్వేషన్ల వల్ల ఆయా పార్టీలు ఎటువంటి వ్యూహం తో ముందు కు వెళ్తాయో చూడాలి

# మా వార్డు రిజర్వేషన్‌పై జర స్పందించండి.!





- కోరుట్ల మున్సిపల్ 7వ వార్డుకు ఎస్టీ రిజర్వేషన్‌పై తీవ్ర వివాదం
- బీసీ ఓటర్లకు అన్యాయం జరిగిందంటూ గుద్దేటి రాజేందర్ ఆవేదన

**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** పురపాలక ఎన్నికల నేపథ్యంలో కోరుట్ల మున్సిపాలిటీలోని 33 వార్డులకు ఖరారు చేసిన రిజర్వేషన్ విధానం తీవ్ర వివాదానికి దారి తీసింది. ముఖ్యంగా 7వ వార్డుకు ఎస్టీ రిజర్వేషన్ కేటాయించడంపై బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో 7వ వార్డు వాసి గుద్దేటి రాజేందర్ మంగళవారం కోరుట్ల అర్బన్ కాలనీలో మీడియా సమావేశం నిర్వహించి, వార్డు రిజర్వేషన్‌పై జిల్లా కలెక్టర్ స్పందించాలని డిమాండ్ చేశారు.

## ఓటరు శాతాలకు విరుద్ధంగా రిజర్వేషన్.?

మీడియాతో గుద్దేటి రాజేందర్ మాట్లాడుతూ కోరుట్ల పట్టణంలోని 8వ వార్డులో 303 మంది ఎస్టీ ఓటర్లు, 12వ వార్డులో 186 మంది ఎస్టీ ఓటర్లు, 23వ వార్డులో 96 మంది ఎస్టీ ఓటర్లు ఉన్నప్పటికీ ఆయా వార్డులకు జనరల్ రిజర్వేషన్ కేటాయించారని తెలిపారు. అయితే కేవలం 57 మంది మాత్రమే ఎస్టీ ఓటర్లు ఉన్న 7వ వార్డుకు ఎస్టీ రిజర్వేషన్ కేటాయించడం వెనుక ఉన్న నిబంధనలు, ప్రమాణాలు ఏమిటో ప్రజలకు వివరించాలని కోరారు.

## 7వ వార్డులో 99 శాతం బీసీ ఓటర్లే

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం 7వ వార్డులో మొత్తం 2050 మంది ఓటర్లు ఉండగా, అందులో సుమారు 1990 మంది (దాదాపు 99 శాతం) బీసీ వర్గానికి చెందినవారే. మిగిలిన కేవలం 60 మంది మాత్రమే ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర వర్గాలకు చెందినవారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయడం వల్ల బీసీ వర్గ ఓటర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వంద శాతం ఎస్టీ ఓటర్లు ఉన్న వార్డులకు దక్కని న్యాయం

మరోవైపు కోరుట్ల మున్సిపాలిటీలోని 8వ వార్డులో మొత్తం 400 మంది ఓటర్లు ఉండగా, వారందరూ ఎస్టీ వర్గానికి చెందినవారేనని, అలాగే 12వ వార్డులో 220 మంది ఓటర్లు ఉండగా వారంతా కూడా ఎస్టీ వర్గానికి చెందినవారేనని తెలిపారు. ఇలాంటి వార్డులకు ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయకుండా, ఎస్టీ ఓటర్లు లేనట్టే ఉన్న 7వ వార్డుకు రిజర్వేషన్ కేటాయించడం న్యాయసమ్మతం కాదని బీసీ వర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## రిజర్వేషన్ ఉద్దేశ్యానికి విరుద్ధం

రిజర్వేషన్ ఉద్దేశ్యం సంబంధిత వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమేనని, కానీ ఎస్టీ జనాభా లేనట్టే ఉన్న వార్డుకు ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వడం ఆ ఉద్దేశ్యానికి విరుద్ధమని గుద్దేటి రాజేందర్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల బీసీ వర్గానికి చెందిన ఓటర్లకు తమ ప్రతినిధిని ఎన్నుకునే హక్కు కోల్పోతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎస్టీ సోదరులతో విభేదాలు లేవు

తనకు ఎస్టీ సోదరులతో ఎలాంటి విభేదాలు లేవని గుద్దేటి రాజేందర్ స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా, నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు కేటాయిస్తే తాము హృదయపూర్వకంగా స్వాగతిస్తామని తెలిపారు. అయితే ఈ రిజర్వేషన్ నిర్ణయం రాజ్యాంగ ప్రక్రియ ప్రకారం ఎలా ఖరారైందో పూర్తి వివరాలు ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

## స్థానిక సంస్థల జిల్లా కలెక్టర్‌కు సవినయ వినతి

ఈ నేపథ్యంలో 7వ, 8వ, 12వ వార్డుల ఓటరు శాతాలను మరోసారి ఖచ్చితంగా పరిశీలించి, రిజర్వేషన్ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ రాజా గౌడ్‌కి 7వ వార్డు ప్రజలు సవినయంగా వినతి చేస్తున్నారు. జనాభా శాతాల ఆధారంగా న్యాయసమ్మతమైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఈ మీడియా సమావేశంలో గుద్దేటి రాజేందర్‌తో పాటు అర్బన్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ ఆవేదనను వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌పై తక్షణమే స్పష్టత ఇవ్వకపోతే తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

# ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక

**- మాజీ ఎంపీటీసీ కవిత శ్రీనివాస్ రెడ్డి**

**నేటిసాక్షి : జగదేవపూర్** తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే గొంతుకగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై అక్రమ కేసులు పెట్టి రాజకీయంగా అణిచివేయాలని రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తోందని జగదేవపూర్ బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు,మాజీ ఎంపీటీసీ కొత్త కవితా శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నించడం,బొగ్గు స్కాం వంటి అక్రమాలను బయటపెట్టడం నేరమా అని వారు నిలదీశారు. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజల శ్రేయస్సు కోసం తపించే సేవకుడిగా హరీశ్ రావు ఇరవై ఐదు ఏళ్లకు పైగా తన రాజకీయ ప్రస్థానంలో నైతిక విలువలను పాటిస్తూ పట్టుదలతో పనిచేసి ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు, హైకోర్టులు కొట్టివేసిన తర్వాత కూడా హరీశ్ రావుపై అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకను అణిచివేయాలనే కుట్రలు ఎప్పటికీ ఫలించవని స్పష్టం చేశారు. ఈ పరిణామాలన్నింటినీ తెలంగాణ సమాజం గమనిస్తోందని, యావత్ తెలంగాణ ప్రజలు హరీశ్ రావు వెంట ఉన్నారని వారు తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే వ్యక్తి కాదని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

## బాధ్యతగా వ్యవహరిద్దాం




**నేటి సాక్షి-మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకరయ్య, మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల వైపు మల్ల కుండా ఉండాలని అలాగే హెల్మెట్ లేని డ్రైవింగ్ త్రిబుల్ రైడింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం రిజిస్ట్రేషన్ లేని వాహనాలు నడపడం సీటు బెల్టు లేని ప్రయాణం వీటి వల్ల జరిగే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో , కానిస్టేబుల్ సత్తయ్య, గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులకి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

## టి.ఆర్ నగర్‌లో రూ. 1.25 కోట్లతో నిర్మించిన వయోవృద్ధుల సదనం ప్రారంభం

## బైపాస్ రోడ్డులో 'ప్రణం డే కేర్ సెంటర్' ప్రారంభోత్సవం



## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లలపై కఠిన చర్యలు తప్పవు

**నేటి సాక్షి - జగిత్యాల(రాధారపు నర్సయ్య)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా, స్థానిక టి.ఆర్ నగర్‌లో రూ. 1.25 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వయోవృద్ధుల సదనాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి ఘనంగా ప్రారంభించారు.

## ప్రణం డే కేర్ సెంటర్‌ని ప్రారంభించిన మంత్రి

ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..వయోవృద్ధుల హక్కులను, బాధ్యతలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం. వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సదనం, ప్రణం డే కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామని అన్నారు. కన్న తల్లిదండ్రులను విస్మరించే లేదా నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వృద్ధాశ్రమానికి ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ. 30 లక్షలు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోరగా, సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ మాట్లాడుతూ..టి.ఆర్ నగర్‌లో అత్యాధునిక వసతులతో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని అన్నారు. వయోవృద్ధులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ)బి. రాజ గౌడ్, ఆర్.డి.ఓ మధు సూదన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఇన్చార్జి డి.డబ్ల్యూ.ఓ (ఐబో) కె. రాజ్ కుమార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రేపు ధర్మపురిలో భట్టి విక్రమార్క పర్యటన



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి(గుండ ప్రశాంత్ గౌడ్)** తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం ధర్మపురి నియోజక వర్గంలో పర్యటించనున్నారు. ఇప్పటికే ఆయన ధర్మపురి పర్యటన షెడ్యూల్ ను అధికారులు విడుదల చేశారు. బేగంపేట్ ఎయిర్ పోర్టు నుంచి నేరుగా ధర్మపురి జూనియర్ కళాశాల గ్రౌండ్ కు హెలికాప్టర్ లో చేరుకుంటారు. ప్రత్యేక అధికారులతో సమావేశం అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి ప్రత్యేక పూజలు చేస్తారు ఆతర్వాత రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు 10 కోట్ల తో నిర్మించ బోతున్న డిగ్రీ కళాశాల భవనానికి,17 కోట్ల తో కట్ట నున్న సీవేజ్ ప్లాంట్ ఎస్సీ హాస్టల్ భవనానికి, ఎలక్ట్రికల్ లైన్ వర్క్స్ కు, 33 / 11కెవి సబ్ స్టేషన్లకు వాటర్ సప్లై ఫెసిలిటేషన్ డిస్ట్రిబ్యూషన్ అండర్ ఫార్మ్ మెకానైజేషన్ స్కీం లకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆడ్లూరు లక్ష్మణ్ కుమార్ లు శంకుస్థాపన చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి నీ ఘనంగా స్వాగతించడానికి ధర్మపురి కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం అవుతున్నారు. ఇవే కాకుండా ధర్మపురి పై ఉప ముఖ్య మంత్రి మరిన్ని వరాల జల్లులు కురిపించే అవకాశం ఉన్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటనతో ధర్మపురి దశ తిరగబోతుందని అందరూ అనుకొంటం విశేషం ఇదిలా ఉంటే బట్టి పర్యటనలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసు కుండా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘు చందర్ ఆధ్వర్యంలో సీఐ రాం నరసింహ రెడ్డి ధర్మపురిలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## వికలాంగుడికి స్కూటీ మంజూరు



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి: (గుండ ప్రశాంత్ గౌడ్ )** గొల్లపల్లి మండలం అగ్గిమల్ల గ్రామానికి చెందిన వికలాంగుడైన మల్లెత్తుల మహేష్ కు స్కూటీ కావాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కోరగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మహేష్‌కు స్కూటీని మంజూరు చేయించగా అట్టి స్కూటీని ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్ కు అందజేసారు. ఈకార్యక్రమంలో గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి అగ్గిమల్ల సర్పంచ్ లక్ష్మణ్ మాజీ ఉప సర్పంచ్ హరి కిరణ్ యూత్ కాంగ్రెస్ నాయకులు కుమార్ పాల్గొన్నారు

## సత్వర సేవలు అందించాలి

### 108 అంబులెన్స్ జిల్లా మేనేజర్ కుమారస్వామి



**నేటి సాక్షి, ధర్మారం:** అత్యవసర సమయంలో ఉన్న క్షతగాత్రులకు సత్వర సేవలు అందించాలని 108 అంబులెన్స్ పెద్దపల్లి జిల్లా మేనేజర్ జంపాల కుమారస్వామి పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబులెన్స్ లోని వైద్య పరికరాలను, రికార్డుల నిర్వహణ ను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న అత్యవసర సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి ఆరె సతీష్, పైలట్ మెరుగు శ్రీనివాస్ లు ఉన్నారు.

## జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ



**నేటి సాక్షి- మెట్‌పల్లి(దామ రాజేష్):** మల్లాపూర్ మండల ఎంపిడిఓ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ ఈరోజు మండల కేంద్రంలో చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి వంశీధర్ రెడ్డి మండల అధ్యక్షుడు మురళి, మండల ప్రధాన కార్యదర్శి రూథ అశోక్, సీనియర్ కార్యదర్శులు నారాయణరెడ్డి, రంజిత్ కుమార్, ముబీన్ మరియు ఇతర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

## విద్యుత్ సమస్యలకు ప్రజా బాట




**నేటి సాక్షి - మెట్‌పల్లి (దామ రాజేష్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా బాట కార్యక్రమం లో భాగంగా చిట్టాపూర్ గ్రామంలో విద్యుత్ ాజు సంతోష్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు ఏమున్నా అధికారులకు తెలిపి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారం దిశగా వెళ్లాలని అందుకు గ్రామస్తుల యొక్క సహకారంతో సమస్యలు పరిష్కరించుకోవాలని తెలపడం జరిగింది.. ఈ యొక్క కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాల్సని ప్రణయ్,వార్డు మెంబర్లు ఇట్టేడి శంకర్,మట్ట రాములు,రామగిరి సంజీవ్,ఉప్పులూటి లక్ష్మీ నారాయణ,సంపాతి ఆశలు,దండుగుల అంజిరాజు, సార్ల దేవరెడ్డి, లైన్ మెన్ కొత్తురి శంకర్ విద్యుత్ అధికారులు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమాయక మహిళలే లక్ష్యంగా..

- దృష్టి మరల్చి బంగారం దొంగిలిస్తున్న అంతర్ జిల్లా ముఠా అరెస్ట్ .
- జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా.



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో గత కొన్ని రోజులుగా అమాయక మహిళలే లక్ష్యంగా చేసుకొని, వారి దృష్టి మరల్చి బంగారం దొంగిలిస్తున్న ముగ్గురు పాత నేరస్తుల ముఠాను జిల్లా సిసిఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.

### నేర వివరాలు & దర్యాప్తు:

జిల్లాలోని ధారూర్, వికారాబాద్ టౌన్ పరిగి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా మహిళలను మోసం చేసి బంగారం దొంగిలించిన ఘటనలు నమోదు కావడంతో, జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఈ కేసులను సీరియస్‌గా పరిగణించారు. నిందితులను తక్షణమే పట్టుకోవాలని జిల్లా సీసీస్ పోలీసు అధికారులను ఆదేశించారు.

ఎస్పీ ఆదేశాల మేరకు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఆధ్వర్యంలోని బృందం రంగంలోకి దిగింది. సీసీటీవీ ఫుటేజీలు, టెక్నికల్ ఆధారాలు మరియు నేరం జరిగిన తీరును విశ్లేషించి, పక్కా సమాచారంతో ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

### అరెస్టు చేయబడిన నిందితులు:

ఎ-1) వేముల లక్ష్మి wo వేముల నాగేశ్వరారావ్, రామ రావ్ నగర్, నియర్: స్కూల్, బోరబండ, బాలానగర్. ఏ -2) చెల్లా నర్సమ్మ wo చెల్లా వెంకటేష్, RoH No. 8-19, దంగా ఖలీజ్ ఖాన్, కిస్మాతపుర, రాజేంద్ర నగర్, కేవీ రంగా రెడ్డి.ఏ -3) బండారి అనిత wo లేట్. బండారి గిరి, ఏజ్:శివ శంకర్ కాలనీ, ఎల్లమ్మ టెంపుల్, ఫాతే నగర్, బాలానగర్, సనత్ నగర్, వీరు కేవలం వికారాబాద్ జిల్లాలోనే కాకుండా నారాయణపేట జిల్లాలోని మద్దూర్, కోస్గి నరననపేట టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ, గతంలో సైబరాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, రాచకొండ జగిత్యాల జిల్లాల్లో సుమారు 28 కేసుల్లో నిందితులుగా ఉన్నారు.

### నేరం చేసే విధానం (మోడుస్ ఆపరేండి)

ఈ ముఠా ప్రధానంగా ఒంటరిగా ఉన్న, వయసు పైబడిన అమాయక మహిళలనే టార్గెట్ చేస్తారు. వీరి మోసం చేసే పద్ధతి ఈ విధంగా ఉంటుంది: 1.నకిలీ బంగారం ఎర: రద్దీగా ఉండే మార్కెట్లు లేదా నిర్మానుష్య ప్రదేశాల్లో మహిళలను ఎంచుకుంటారు. వారి ముందు నకిలీ బంగారు బిస్కెట్లు, రాడ్లు లేదా బంగారు రంగు పూసిన రాళ్లను పడవేస్తారు లేదా తమకు దొరికినట్లు నటిస్తారు. 2.నమ్మకంతో మోసం (కాంఫిడెన్స్ ట్రిక్): "మాకు బంగారం దొరికింది, దీనిని మనం పంచుకుందాం" అని బాధితురాలిని నమ్మించి మాటల్లో పెడతారు. ఆ నకిలీ బంగారాన్ని బాధితురాలికి ఇచ్చి, ఆమె మెడలో ఉన్న అసలైన బంగారు గొలుసులు, కమ్మలు తీసుకుంటారు. 3.మత్తు మందు ప్రయోగం: కొన్ని సందర్భాల్లో బాధితురాలిని మాటల్లో పెట్టి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి మత్తు మందు ప్రయోగించి (స్టుపెఫయింగ్ డ్రగ్స్), వారు స్పృహ కోల్పోయాక బంగారం దొంగిలిస్తారు.

### జిల్లాలో జరిగిన ప్రధాన సంఘటనలు:

ధారూర్ (22.11.2025): కంది లక్ష్మమ్మ అనే మహిళ కూరగాయల మార్కెట్ వద్ద ఉండగా, ఆమెకు నకిలీ బంగారు రాడ్ చూపించి, ఆమె మెడలోని 1.8 తులాల బంగారం (గొలుసు, కమ్మలు, మ్యాట్నీలు) కాజేసి మోసం చేశారు. వికారాబాద్ (30.11.2025): బాసుపల్లి సత్యమ్మను సుబాష్ నగర్ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి, బంగారు రాయి లాంటి వస్తువు చూపించి, ఆమెకు తెలియకుండానే మత్తు మందు ప్రయోగించి 2 తులాల గొలుసును దొంగిలించారు.పరిగి (05.01.2026): పోమల ఈశ్వరమ్మను వెంబడించి, రోడ్డుపై పర్సు దొరికినట్లు నాటకమాడి, అందులో 5 తులాల బంగారం ఉందని నమ్మించారు. ఆ నకిలీ బిస్కెట్ ఆమెకు ఇచ్చి, ఆమె వద్ద ఉన్న 1 తులం గొలుసు, 3 గ్రాముల కమ్మలు తీసుకొని ఉడాయించారు.

### ప్రజలకు విజ్ఞప్తి:

అపరిచితులు ఎవరైనా బంగారం దొరికిందని చెప్పినా, లేదా మాయమాటలు చెప్పి దగ్గరకు వచ్చినా నమ్మవద్దు. ముఖ్యంగా మహిళలు మార్కెట్లు, ప్రయాణాల్లో ఉన్నప్పుడు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి. అనుమానం వస్తే వెంటనే డయల్ 100 కి లేదా దగ్గర్లోని పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని కోరుచున్నాము.

కేసును చాకచక్యంగా ఛేదించిన సీసీస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### స్వాదినపర్చుకున్న వస్తువులు:

1). 8 తులాల 8 గ్రాముల బంగారము
2). 50 తులాల వెండి.
3). మూడు (3) సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# నవ దుర్గా సేవా సమితి నూతన కమిటీ ఎన్నిక



**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని పద్మపురి వాడ (కాపు వాడ)లోని 'నవ దుర్గా సేవా సమితి' ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా నీలి షణ్ముఖ్ ని, ఉపాధ్యక్షులుగా నీలి శ్రవణ్ ని ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా జాప రామ్ నివాస్, సంయుక్త కార్యదర్శిగా శ్రీరాముల సిద్దులు బాధ్యతలు స్వీకరించారు కోశాధికారిగా పెద్దబోయిని రోహిత్ ని నియమించగా, కార్య నిర్వాహక సభ్యులుగా ఎడ్ల గణేష్, రాధారపు ఉదయ్ ని ఎంపిక చేశారు. ప్రధాన సాక్షులుగా శ్రీరాముల రాహుల్, రాధారపు యశ్వంత్ ని నియమించారు. నూతన కమిటీ సభ్యులు సమితి అభివృద్ధి, భక్తి కార్యక్రమాలు, సామాజిక సేవలకు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# పాత్రికేయుల సమస్యలపై పోరాటమే శరణ్యం

- ప్రమాదం అంచున పత్రికా స్వేచ్ఛ
- సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్
- సంఘం బలోపేతానికి సమిష్టి కృషి అవసరం





**నేటి సాక్షి - జగిత్యాల(రాధారపు నర్సయ్య):** జర్నలిస్టుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు మరిన్ని గడ్డు పరిస్థితులు ఎదురవుతాయని, అందుకు అప్రమత్తమై ఫెడరేషన్ నాయకత్వంలో పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్ హాలులో టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా సన్నాహక సమావేశం జరిగింది.

### ప్రమాదపు అంచుల్లో జర్నలిస్టుల హక్కులు

ఈ సమావేశంలో మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కులు తీవ్ర ప్రమాదపు అంచుల్లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు జర్నలిస్టుల ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండుసార్లు అధికారంలో కొనసాగిన గత ప్రభుత్వం జర్నలిస్టులను పూర్తిగా విస్మరించి తీరని అన్యాయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో కొనసాగుతోందని విమర్శించారు.

### అక్రెడిటేషన్లపై ఆందోళన

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేయలేకపోయిందని మామిడి సోమయ్య అన్నారు. రివ్యూ కమిటీ పేరుతో కాలయాపన చేసి చివరికి జర్నలిస్టులకు ఆందోళన కలిగించే జీవో 252ను జారీ చేసిందని ఆరోపించారు. రాబోయే ఒకటి, రెండు నెలలు జర్నలిస్టులకు అత్యంత కీలకమని, అక్రెడిటేషన్ కార్డులను భారీగా తగ్గిస్తారనే ప్రచారం జరుగుతోందని తెలిపారు. అక్రెడిటేషన్లు తగ్గిస్తే ఊరుకునేది లేదని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు.

### జర్నలిస్టుల డిమాండ్లు

జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెన్షన్ స్కీం, హెల్త్ కార్డులు, జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం వంటి డిమాండ్ల సాధనకై ఫెడరేషన్ ఆధ్వర్యంలో బలమైన పోరాటం చేయాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. మీడియా సంస్థలు, జర్నలిస్టుల సంఖ్య అధికంగా ఉన్న హైదరాబాద్ జిల్లాలో ఐక్యత కొరవడిందని, టీడబ్ల్యూజేఎఫ్ ద్వారా జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### ఫెడరేషన్ నాయకుల పిలుపు

ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్లు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, సీనియర్ సభ్యులు బొల్లం శ్రీనివాస్, సీహెచ్ వీరారెడ్డి తదితరులు మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని ఫెడరేషన్ వ్యవస్థాపక సభ్యులంతా ఐక్యంగా ముందుకు రావాలని, జర్నలిస్టుల సమస్యల సాధనకై రాబోయే రోజుల్లో చేపట్టే ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా వి. రవికుమార్ (బీజే టీవీ)ను, కో-కన్వీనర్లుగా గజ్జల వీరేశం (సాక్షి), బి. గోపాల్ (ఆంధ్రజ్యోతి), వర్కాల కృష్ణయ్య (నమస్తే తెలంగాణ), కె. నర్సింగ్ రావు (సూర్య), ఆర్. వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రభ), వి. శ్రీనివాస్ (మనం బ్యూరో), రాజేష్ గౌడ్ (వార్త), బి. శ్రీనివాస్ (ప్రజాజ్యోతి), ఎం. శ్రీశైలం (వాయిస్ టుడే), ఆర్. శ్రీనివాస్ గౌడ్ (సాక్షి డిజిటల్ న్యూస్), వెంకట్ (యామ్స్ న్యూస్ ఇంగ్లీష్ డైలీ), సీహెచ్ బ్రహ్మం (ఏబీ న్యూస్), వేణుగోపాల్ (హెచ్‌డీఎస్), పి. సంతోష్ (టీఆర్ 9 న్యూస్) తదితరులను నియమించారు.ఈ సందర్భంగా మామిడి సోమయ్య పలువురు నూతన జర్నలిస్టులకు టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా సభ్యత్వాలను అందజేశారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కె. పాండు రంగారావు, నాగరాజు, యర్రమిల్లి రామారావు, రఘురాం, హెచ్‌యూజే నాయకులు వర్కాల కృష్ణ, గజ్జల వీరేశం, ఎన్. సీహెచ్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీలో పెండింగ్ పోస్టులుభర్తీ చేయాలి



- రిజర్వేషన్ల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి
- రాష్ట్రస్థాయి ఎస్సీ-ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల డిమాండ్

**నేటి సాక్షి, తిరుపతి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, టీటీడీ సంస్థలో పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేసి, రూల్ ఆఫ్ రిజర్వేషన్ల విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్రస్థాయి జిల్లాల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించిన సమావేశంలో పలు జిల్లాల ఎస్సీ-ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, వి. రాజ్‌కుమార్, జయశ్రీ, యల్లన్న, ఆరవ పార్వతయ్య, మణిందర్ తదితరులు పాల్గొని పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన అనేక పోస్టులు సంవత్సరాలుగా ఖాళీగానే ఉండటం దురదృష్టకరమని, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో జరుగుతున్న నిర్లక్ష్యం వల్ల దళిత, గిరిజన యువత తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అమలులో ఉన్న ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసుల స్పెషల్ డీఎస్పీ సెల్ వల్ల సత్ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ విధానం లేకపోవడం వల్ల సాధారణ డీఎస్పీలు పని ఒత్తిడితో చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయలేకపోతున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నప్పటికీ అట్రాసిటీ కేసుల్లో 41 నోటీసులు జారీ చేయడం ద్వారా చట్ట ఉద్దేశాన్ని దెబ్బతీసే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు. వెంటనే ఎస్సీ-ఎస్టీ స్పెషల్ డీఎస్పీ సెల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అట్రాసిటీ కేసుల్లో సాంఘిక సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి బాధితులకు న్యాయం చేయాల్సి ఉన్నప్పటికీ, కాంపోజిషన్ ఫండ్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులు మరణిస్తే, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంలోనూ తీవ్ర అలసత్వం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ వాడలకు స్మశానాలు లేకపోవడం, ఉన్న చోట్ల దారి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. స్మశానాలు లేని వాడలకు స్మశానాలు ఏర్పాటు చేయాలని, దారి సమస్య ఉన్న చోట్ల ప్రజాప్రయోజనాల నిమిత్తం భూసేకరణ చట్టం ప్రకారం శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు.

### ఎస్సీ-ఎస్టీ కార్పొరేషన్‌లకు నిధులు

మార్చి లోగా ఎస్సీ-ఎస్టీ కార్పొరేషన్‌లకు నిధులు మంజూరు చేసి, సూక్ష్మ ఎస్సీ-ఎస్టీ పారిశ్రామికులకు సబ్సిడీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే జీవో నెంబర్ 694/2001 ప్రకారం ప్రతి నెల చివరి వారంలో అన్ని జిల్లా కలెక్టరేట్లలో ఎస్సీ-ఎస్టీ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలని కోరారు. డాక్టర్ సుధాకర్ కుటుంబానికి సహాయం హర్షణీయం డాక్టర్ సుధాకర్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించి, ఆయన కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్ క్యాడర్ ఉద్యోగం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే గత ప్రభుత్వ కాలం నుంచి ఇప్పటివరకు అగ్రవర్ణాల చేతుల్లో హత్యకు గురైన దళిత, గిరిజన కుటుంబాలను గుర్తించి వారికి కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

### ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, తమ సమస్యలపై వినతి పత్రం అందజేశామని తెలిపారు. దీనిపై చైర్మన్ జవహర్ బాబు సానుకూలంగా స్పందించి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ సమావేశంలో గుంటూరు, తిరుపతి, చిత్తూరు, అనకాపల్లి, ప్రకాశం, సత్యసాయి, అన్నమయ్య, పల్నాడు, బాపట్ల తదితర జిల్లాల డీవీఎంసీ సభ్యులు బ్రహ్మయ్య, రెడ్డి రమణమ్మ, ప్రశాంతి, పెంచులయ్య, ఎస్. రవి, అప్పారావు, రాజు, కృష్ణమూర్తి, గంగాధర్, రవికాంత్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# పెటిక సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా



- ఆత్మీయ సన్మాన సభలో కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి వీరభద్రరావు స్పష్టం
- పెటిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన సన్మానం

**నేటి సాక్షి తిరుపతి,తిరుపతి:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెటిక కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఎదురవుతున్న సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెటిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి వీరభద్రరావు (బద్రి) హామీ ఇచ్చారు. మంగళవారం తిరుపతి రూరల్ పరిధిలోని స్థానిక యూత్ హాస్టల్‌లో పెటిక కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పెటిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి వీరభద్రరావుకు సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న పెటిక కులస్తులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, ఉద్యోగ పరంగా సమగ్ర అభివృద్ధి సాధించేలా కృషి చేస్తానన్నారు. పెటికల ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. పెటిక కుల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు తక్కువ వడ్డీతో విద్యా రుణాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. అలాగే పెటికలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎంఎస్ఎంఈ ద్వారా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొంటూ, పెటిక కులస్తులందరూ ఐక్యతతో హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సన్మాన సభలో ఆకా గుర్రప్ప, దేవరాజులు, పరమశివయ్య, కె. రాజేంద్ర, పోకల రామకృష్ణయ్య, చింతా వెంకట శివయ్య, సముద్రాల నాగేశ్వరరావు, జి. మదనమోహన్, సింగంశెట్టి శివశంకర్, రెడ్డి శేఖర్, బి. నరేంద్ర, జి. చంద్రమౌళి, పురుషోత్తం, టి. వెంకట సిద్ధయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక





**రాయికల్ - నేటి సాక్షి ( ఇమ్మడి విజయ్ కుమార్ ):** రాయికల్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ జేఏసీ కార్యాలయంలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షులుగా చింతకుంట సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా సింగిడి శంకర్, కోశాధికారిగా కడుకుంట్ల జగదీశ్వర్, ఉపాధ్యక్షులుగా యాచమనేని కిరణ్ బాబు, సింగని శ్యాంసుందర్, సంయుక్త కార్యదర్శిగా తిరుమల శంకర్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎద్దండి ముత్యం రాజు రెడ్డి కార్యవర్గ సభ్యులుగా గంగాధరి సురేష్, కళ్ళెం శ్రీనివాస్, ఎద్దండి జితేందర్ రెడ్డి, తీగుళ్ళ గోపాల్ రెడ్డి, కనికరపు లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు సయ్యద్ రసూల్, పర్యవేక్షకులుగా గుర్రాల వేణు, పటేల్ నరేందర్, నాగమల్ల శ్రీకర్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగుపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలి.

### అధిక దిగబడులతో ఆర్థిక లాభాలతో ముందుకు సాగాలి.

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ . శాసనసభ్యులు డా సంజయ్ కుమార్





**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ మండల పరిధిలో నీ ఎర్రవల్లి, మదనపల్లి గ్రామాల్లో మంగళవారం ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులతో ఉద్యానవన శాఖ అధికారులు, వివిధ బ్యాంకర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... ఉద్యానవన పంటలను నాణ్యతతో పండించినట్లయితే అధిక లాభాలను ఆశించ పచ్చన్నారు. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుందని, అలాంటి వివరాలను సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఉద్యానవన పంటలను పండిస్తున్న రైతుల సమస్యలను తెలుసుకోవడానికి అదేవిధంగా రైతుల సూచనలను పరిగణలోకి తీసుకొని రైతులకు కావలసిన అవసరాలు తెలుసుకునేందుకు అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పూలు, కూరగాయలు, పండ్ల తోటల సాగుతో పాటు ఆయిల్ ఫామ్ పంటలు వేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. రైతులు వివిధ పంటలు వేసిన క్రమంలో అధిక దిగుబడును రావడానికి వ్యవసాయ శాస్త్రజ్ఞులచే శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. చిన్న సన్నకారు రైతులను కూడా గుర్తించి సబ్సిడీలు అందజేసి ఆర్థికంగా బలపడేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే నర్సరీల ఏర్పాటుకు సబ్సి ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు మార్కెటింగ్ చేసుకునేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ స్థలానికి కేటాయించలేని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మార్కెటింగ్, రైతు బజార్ సమస్యలను పరిష్కరిస్తానని రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతులకు నాణ్యమైన వంగడాలు అందించేలా అదేవిధంగా ఏ ఏ సమయాల్లో పంటలకు ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడి అధిక దిగుబడులు పొందే విధంగా ఎప్పటికప్పుడు తగు సూచనలు అందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కొత్త గడి, ఎర్రవల్లి, మదనపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఉద్యానవన పంటలను అధికారులు, రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా వికారాబాద్ లో గల పట్టుదార పరిశ్రమ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, ఆర్టిఏ సభ్యులు జాఫర్, సర్పంచులు సయ్యద్ రబ్బాన్, బిల్లపాటి విజయలక్ష్మి, పట్టు పరిశ్రమ ఎడి నాగరత్న, ఉద్యానవన అధికారులు కమల, డాక్టర్ సురేంద్రనాథ్, యమున తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పాటించాలి



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు, అలివేలు కార్యక్రమంలో భాగంగా మరికల్ సబ్ స్టేషన్ వద్ద ఎస్సై రాము ఆధ్వర్యంలోలి వాహన డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లు, వాహనదారులతో మద్యం సేవించి వాహనాలు నడపరాదు, ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి, హెల్మెట్, సీట్‌బెల్ట్ వాడాలి, అతివేగం నివారించాలి అనే అంశాలపై రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై రాము మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం సేవించి వాహనాలు నడపడం మరియు ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడమేనని తెలిపారు. ప్రతి వాహనదారుడు తన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం వల్లే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే పోలీస్ శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మరికల్ పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి టూ కొండపోచమ్మ

-రెండవ రోజు భక్తుల రద్దీ







**నేటిసాక్షి : జగదేవపూర్ :** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కొండపోచమ్మ అమ్మవారి జాతరకు రెండవ రోజు భక్తుల తాకిడి పెరిగింది. సోమవారం కొమురవెల్లి మల్లన్న ను దర్శించుకున్న భక్తులు మంగళవారం ఉదయం అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. జాతర రెండవ రోజు కావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూ లైన్ లో గంటల తరబడి నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కొత్త కుండలో నైవేద్యం వండి నెత్తిన ఎత్తుకొని, చిన్నారులు కొత్త బట్టలు ధరించి డప్పు చప్పుళ్లు మధ్య నాట్యం చేస్తూ శివసత్తులు సిగాలు ఊగుతూ, పోతరాజుల విన్యాసాలు చేస్తూ అమ్మవారి సన్నిధికి చేరుకోని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఓడి బియ్యం పోయడానికి భక్తులు క్యూ లైన్ లో పోటీ పడ్డారు. కొండపోచమ్మ అమ్మవారి నామస్మరణ తో ఆలయ పరిసరాలు కరుణించమ్మ కొండపోచమ్మ... కాపాడమ్మ కొండపోచమ్మ అంటూ మారుమోగాయి. ఆలయ పరిసరాల్లో కీలో మీటర్ల దూరంలో గుడారాలు వేలిశాయి. భక్తులు రద్దీ ఎక్కువగా ఉండడంతో జగదేవపూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు. ఆలయం వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఆలయ ఈఓ రవి కుమార్, సర్పంచ్ సంధ్య శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రజీత రమేశ్ లు రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద ఉంటూ ఎప్పటికప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

## పాఠశాలలో ఆటలు పోటీలు



**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు రిపబ్లిక్ డే ను పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతూ ఉంటుంది ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రధానం జరుగుతూ ఉంటుంది అందులో భాగంగా కామ్రేడ్ దొడ్డ నరసయ్య ప్రతి సంవత్సరం 5000 రూపాయలను బహుమతులకు గాను పాఠశాలకు 5000 రూపాయలను దొడ్డ పద్మ పేరుతో ఇవ్వడం జరుగుతుంది

## సారక్క జాతరకు మంత్రి

అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆహ్వానం



**నేటి సాక్షి, జగిత్యాల:(గుండ ప్రశాంత్ గౌడ్ ):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూర్ గ్రామంలో జరిగే శ్రీ సమ్మక్క సారక్క జాతర ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆహ్వానం అందజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో గొల్లపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చిల్వకోడూర్ గ్రామ సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్ యూత్ మండల అధ్యక్షులు గౌతమ్. ఉప సర్పంచ్ దిటీ మహేష్ ,గందే భాస్కర్,అల్లాడి వెంకన్న , బుస రాజేందర్ ముద్దం సాయికుమార్ మేశీగు వినయ్ పాల్గొన్నారు

# సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- ఎంపిహెచ్ఏ ఫలితాలను విడుదల చేయాలి
- తెలంగాణ సెకండ్ ఏఎన్ఎం ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మధురిమ మంత్రి "అడ్లూరి" కి వినతి



**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** గత 18 ఏళ్లుగా వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎం ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలనీ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఉద్యోగులు మంగళవారం జగిత్యాలలో వినతిపత్రం సమర్పించారు చాలి చాలని జీతాలతో వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మా జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం జగిత్యాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి లక్ష్మణ్ కుమార్ కు తెలంగాణ సెకండ్ ఏఎన్ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల మధురిమతో పలువురు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. తెలంగాణ మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ పరిధిలో గత 13 నెలల క్రితం ఎంపిహెచ్ఏ మహిళా ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసి ఉద్యోగాలను భర్తీచేసి 6 వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లో సెకండ్ ఏ ఎన్ ఎం లను ఆదుకోవాలన్నారు. ఉద్యోగాల్లో ఉండి మరణించిన సెకండ్ ఏఎన్ఎంల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మధురిమ మంత్రిని కోరారు. ప్రజలకు ముఖ్యంగా గ్రామినా ప్రాంతాల్లో పనిచేస్తున్న సెకండ్ ఏ ఎన్ ఎం ల సమస్యలు పరిష్కరించాలని, అది కాంగ్రెస్ ప్రభుత్వశీ ద్వారానే అవుతుందనే నమ్మకం ఉందని చెబుతూ ప్రభుత్వం మాపై శ్రద్ధ వహించి కోర్కెలు తీర్చాలని మధురిమ కోరారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ ను కలిసినవారిలో మధురిమతో పాటు రజిత భాయి, శారద, రజిత, సౌజన్య, యమున, సరోజ, శిరీష, శైలజ, జయప్రద, జ్యోతి, ఉజ్వల, శ్రవంతి, మహేశ్వరి, మధులత, ఎలిజబెత,మేరీ, సుమలత, చిలుకమ్మ తదితరులున్నారు.

# అవకాశమిస్తే.. 4వ డివిజన్ ను అభివృద్ధి చేస్తా...





**నేటి సాక్షి, కరీంనగర్ :** కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం కల్పించి టికెట్ ఇస్తే నాలుగో డివిజన్ అభ్యర్థిగా పోటీలో ఉంటాననీ, డివిజన్ ప్రజలు తనకు అవకాశమిచ్చి గెలిపించాలని అభ్యర్థి కాశిపాక మురళీకృష్ణ కోరారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ సిటీ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తనను గెలిపిస్తే డివిజన్ ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి కరీంనగర్ లోనే నెంబర్-1 స్థానంలో నిలుపుతానని తెలిపారు. తాను 2014-16 వరకు ఎన్ ఎస్ యూఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా, 2016-18 వరకు యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. అలాగే దుర్షేడ్ గ్రామశాఖా అధ్యకుడిగా 2018 నుంచి 22 వరకు, 2018 నుంచి 23 వరకు వార్డు సభ్యుడిగా పనిచేయడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగానని చెప్పారు. తనను ప్రజలు గెలిపిస్తే మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు, స్థానిక నాయకులు వెలిచాల రాజేందర్ రావు, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సహకారంతో డివిజన్ అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి, అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చాడు.

- కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే భరిలో ఉంటా..
- అభ్యర్థి కాశిపాక మురళీకృష్ణ..

# 450 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి శంకుస్థాపన






- రూ.235 కోట్లతో క్రిటికల్ కేర్ భవనం ప్రారంభం
- జగిత్యాల మెడికల్ హబ్‌గా మారనుంది

**నేటి సాక్షి, జగిత్యాల(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లాలో త్వరలోనే అన్ని రకాల ఆధునిక వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల, క్రిటికల్ కేర్ యూనిట్, సెంట్రల్ మెడిసిన్ స్టోర్, 450 పడకల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఏర్పాటుతో జగిత్యాల ఒక మెడికల్ హబ్‌గా రూపాంతరం చెందనుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాతా-శిశు ఆరోగ్య కేంద్రం, మెడికల్ కళాశాల సమీపంలో రూ.235 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 450 పడకల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి భవనానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అలాగే రూ.23.5 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్, రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జగిత్యాల జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు కూడా నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రానుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించడంలో క్రిటికల్ కేర్ యూనిట్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీల ప్రజలకు ఈ నూతన ఆసుపత్రి వరంగా మారుతుందని చెప్పారు. క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభంతో డయాలసిస్ సేవలు, అత్యవసర ప్రసూతి శస్త్రచికిత్సలు, మూడు ఆధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వస్తాయని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య-ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో జగిత్యాల జిల్లాకు విద్య, వైద్య రంగాల్లో అత్యధిక నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో జగిత్యాల జిల్లాకు ప్రత్యేక మెడికల్ బిల్లు తీసుకువచ్చేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, బడ్జెట్, ఫ్యాకల్టీ నియామకాలు తదితర అంశాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా అన్ని ఆధునిక సౌకర్యాలతో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. పేదలకు వరంగా క్రిటికల్ కేర్ జిల్లాలోని పేద, బలహీన వర్గాల ప్రజలకు క్రిటికల్ కేర్ యూనిట్, ఆక్సిజన్, వెంటిలేటర్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జగిత్యాల జిల్లా అభివృద్ధికి వందల కోట్ల నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులకు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నాలుగు వైపులా రహదారులతో కూడిన ప్రాంతంలో 450 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుండటం విశేషమన్నారు. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర ప్రసూతి కేసులకు ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా 150 పడకల మెడికల్ కాలేజీ ఆసుపత్రి ఉండటంతో జగిత్యాలకు 450 పడకల ప్రధాన ఆసుపత్రి మంజూరైందన్నారు. వైద్య-ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో రూ.40 కోట్ల నిధులతో మెడికల్ కళాశాల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

అంబులెన్స్‌లు, ఎంఆర్ఐ స్కాన్, వైద్య విద్యార్థుల గ్రామీణ సేవల కోసం బస్సులు, మార్చురీ వాహనం అవసరమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. జిల్లాలో అత్యధికంగా 16 పల్లె దవాఖానాలు మంజూరైనట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైన పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు జిల్లా ఆసుపత్రిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మెడికల్ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, డీఎంహెచ్ఓ సుజాత, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.




# హాలో! ఎక్స్‌క్యూజ్ మీ!!

## పంచాయతీ కార్యదర్శి ఉన్నారా!?

- పశువులపరమైన 'పంచాయతీ కార్యాలయం' బాధ్యతలపై రివర్స్ వ్యాఖ్యల కలకలం!
- వార్తా కథనంపై కార్యదర్శి కౌంటర్.. పత్రిక విలేకరిపై వ్యక్తిగత వ్యాఖ్యలు
- తనది తప్పేనని ఒప్పుకోకుండా 'అంగన్‌వాడీ' డిపార్ట్‌మెంట్‌నూ 'వివాదం'లోకి లాగిన వైనం



**'తన మొహం మంచిగ లేక.. అద్దం నేలకేసి కొట్టుకుందట'న్న సామెత చందంగా ఓ ప్రభుత్వ ఉద్యోగి తాను చేసిన తప్పును ఒప్పుకోకుండా.. సంబంధం లేని శాఖను లాగి 'వివాదాస్పదం' చేయడంతో అదికాస్తా చర్చానీయాంశమైంది.**

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

### ఇంతకీ.. ఇప్పుడు ఈ 'వివాదమేంటంటే'?

గ్రామపంచాయతీ కార్యాలయం ప్రజల కోసం ఉండాలా.?.. పశువుల కోసం మారాలా..? సిబ్బంది గైర్హాజరు పై 'మన తెలంగాణ' దినపత్రికలో వచ్చిన వార్తకు బదులుగా తప్పిదాన్ని ఒప్పుకోవాల్సిన చోటా సంబంధిత పంచాయతీ కార్యదర్శి రివర్స్ అటాక్‌కు దిగడం ఇప్పుడు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేశపూర్ గ్రామపంచాయతీలో తీవ్ర చర్చకు దారితీసింది. పాలనా లోపాలపై వచ్చిన వార్తను ఖండించడమే కాకుండా, పత్రిక విలేఖరి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయడం వివాదానికి ఆజ్యం పోసింది.

### కార్యాలయం తాళం.. ఆవరణలో పశువులే అధికం

ఇబ్రహీంపట్నం మండలంలోని కేశపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఉదయం 11:30 గంటలు దాటినా తెరుచుకోకపోవడం గ్రామస్తుల్లో అసహనాన్ని కలిగించింది. ప్రజలు సమస్యలతో కార్యాలయానికి వచ్చేసరికి అక్కడ సిబ్బంది కనిపించకపోగా, ఆవరణలో ఆవులు, గేదెలు స్వేచ్ఛగా సంచరిస్తూ దర్శనమిచ్చాయి. ప్రజాప్రతినిధులు, సిబ్బంది గైర్హాజరు కావడం 'పంచాయతీ కార్యాలయం ప్రజలకు కాదు.. పశువులకు అందుబాటులోకి వచ్చింది' అనే విమర్శలకు కారణమైంది.



### ఫోన్‌లోనే పరిపాలనా?.. పొంతన లేని సమాధానాలు..

ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేయగా తాను ఇబ్రహీంపట్నంలో ఉన్నానని, మరోసారి ఫోన్ చేయగా మరోచోట ఉన్నానని చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యాలయంలో భౌతికంగా లేకుండా ఫోన్ కాల్స్ ద్వారానే పరిపాలన సాగుతోందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. సర్పంచ్ ఎన్నికల అనంతరం కూడా పాలన ఈ స్థాయిలో ఉంటే ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలన్న ప్రశ్నలు తలెత్తాయి.

### వార్తపై కౌంటర్.. బాధ్యత ఒప్పుకోకుండా రివర్స్ దాడి!


పంచాయతీ కార్యాలయ గైర్హాజరు అంశంపై వచ్చిన వార్తకు స్పందించిన కార్యదర్శి, తన తప్పిదాన్ని వివరణాత్మకంగా చెప్పాల్సిన బదులు సోషల్ మీడియాలో.. 'ఆ-వార్త రాసిన విలేకరి నేరెళ్ల సుభాష్ గౌడ్' అనే 'మన తెలంగాణ' పత్రిక విలేకరిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం మరింత వివాదానికి దారితీసింది. తాను ఉదయం 9 గంటలకు విధులకు హాజరై జియో లొకేషన్ ఆధారిత ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా హాజరు నమోదు చేశానని, తన విధుల్లో భాగంగా గ్రామంలో అభివృద్ధి పనుల ఫొటోలు యాప్‌లో నమోదు చేసి, అనంతరం ఎగ్జిక్యూటివ్ విధుల నిమిత్తం ఎంపీడీఓ కార్యాలయంలో హాజరయ్యానని పేర్కొన్నారు.

### 'అంగన్‌వాడీలకు ఫ్లెక్సిబిలిటీ' వ్యాఖ్యలపై ఆగ్రహం

ఇంతటితో ఆగకుండా, తనపై వచ్చిన వార్తను కక్షపూరిత ప్రచారమంటూ, చిట్టీలు కట్టట్లేదని, ప్రకటనలకు డబ్బులు ఇవ్వట్లేదని తప్పుడు ఆరోపణలు చేస్తూ, మరో డిపార్ట్మెంట్ అయిన అంగన్వాడీ ఉద్యోగుల 'ఫ్లెక్సిబిలిటీ'ని ఉదాహరణగా ప్రస్తావించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఒక శాఖ లోపాలను కప్పిపుచ్చుకునే క్రమంలో మరో శాఖ ఉద్యోగులను తక్కువగా చూపించడం అనవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### బాధ్యతారాహిత్యంపై వార్త.. వ్యక్తిగత దూషణలకా?

ప్రజాప్రయోజన అంశాలపై పత్రికల్లో వచ్చిన వార్తను ప్రజాస్వామ్యబద్ధంగా స్వీకరించి వివరణ ఇవ్వాల్సిన అధికారి, రివర్స్‌గా విలేకరి వ్యక్తిగత జీవితం, విలువలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరైనదేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది వ్యక్తిగత వివాదంగా కాకుండా పాలనా వ్యవస్థ పట్ల బాధ్యతాభావాన్ని



పత్రిక సోదరులందరికీ నమస్కారం 🙏..
ఎదుటి వారి విలువలు దెబ్బ తీసేలా దయచేసి తప్పుడు వార్తలు రాయకండి.
సమయపాలన పాటించకున్న నడిచే అంగన్వాడీ టీచర్ లాంటి ఉద్యోగాలలో ఉన్నంత flexibility పంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి లేదు.
మాకు జియో లొకేషన్ ఆధారిత ఫేస్ recognized app తో హాజరు నమోదు చేయాలి.
గ్రామ పంచాయతీ ఆవరణలో లేకున్న, ఆధార్ లో ఉన్న ఫోటో తో సరిపోలకపోయినా హాజరు నమోదు చేయలేము.
నేను రోజు లాగే నిన్న ఉదయం 9.00 గంటలకు విధులకు హాజరై DSR app lo హాజరు నమోదు చేశాను. ఇన్స్పెక్షన్ లో భాగంగా గ్రామంలోని రెండు రోడ్లు, రెండు డ్రెయిన్లు వద్ద పని జరిగే ప్రాంతాన్ని మరియు వైకుంఠ ధామం ఫోటోలను యాప్ లో నమోదు చేసి , గ్రామ పంచాయతీ కార్యదర్శి గా ఎగ్జిక్యూటివ్ విధులలో బాగంగా MPDO ఆఫీస్ లో అధికారుల సమక్షంలో హాజరు అయ్యాను.
కానీ అన్యాయపూరితంగా చిట్టీలు కట్టట్లేదని, advertisement కి అధిక మొత్తంలో డబ్బులు ఇవ్వట్లేదని కక్షపూరితంగా ఇటువంటి తప్పుడు వార్తలు ప్రచురించి నా వ్యక్తిత్వాన్ని, విలువలను దెబ్బతీయడం సమ్మతం కాదు.
11:33 AM

ప్రశ్నించే అంశంగా మారింది.

### ప్రజలకు కార్యాలయం కావాలా! వివాదాలా?

మొత్తంగా చూస్తే.. గ్రామపంచాయతీ కార్యాలయం ప్రజల సమస్యలకు పరిష్కార కేంద్రంగా ఉండాలా? లేక అధికారులుఉ వార్తల మధ్య వివాదాలకు వేదికగా మారాలా? అన్న ప్రశ్నే మిగిలింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవాలను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండే పంచాయతీ పాలనను అమలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.





# పట్టపగలే దోపిడీ!

## సినిమా స్టైల్‌లో మెట్‌పల్లిలో దొంగల బీభత్సం

**వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు ● తల్లిఉకొడుకులపై రాళ్లతో దాడి.. పట్టణంలో భయాందోళన**

**నేటి సాక్షి, కోరుట్లలి (రాధారపు నర్సయ్య) :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. రాంనగర్ కాలనీలోని దోబీ ఘాట్ (చాకిరేవు) వద్ద మంగళవారం మధ్యాహ్నం సమయంలో బట్టలు ఉతుకుతున్న వృద్ధురాలు వన్నెల గంగు (65)మెడలోని మూడు తులాల బంగారు గొలుసును,చెవులకున్న తులం కమ్మలను దుండగులు లాక్కెళ్లిన ఘటన పట్టణంలో కలకలం రేపింది. ద్విచక్ర వాహనంపై వచ్చిన దోపిడీదారులు ఒక్కసారిగా దాడికి దిగడంతో అక్కడే ఉన్న ఆమె కుమారుడు వన్నెల రవి (25) అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయితే దుండగులు వెనుకాడకుండా రాళ్లతో తల్లి, కొడుకులపై దాడి చేసి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు.

**రక్తస్రావం..ఆసుపత్రికి తరలింపులి**

దొంగల చేతిలో రాళ్ల దాడిలో వృద్ధురాలికి, ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే స్పందించి ఇద్దరినీ మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతుండగా, వైద్యులు వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. అయితే పట్టపగలే జనసంచారం ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడంతో రాంనగర్ కాలనీతో పాటు మెట్‌పల్లి పట్టణ ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

**పోలీసుల అలర్ట్..**

సమాచారం అందుకున్న మెట్‌పల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ ప్రకటన విడుదల చేస్తూ, ద్విచక్ర వాహనంపై వచ్చిన ముసుగు దొంగలు మెరూన్ రంగు షర్ట్, తెలుపు రంగు షర్ట్ ధరించి మాస్కులు పెట్టుకుని ఉన్నట్లు తెలిపారు. పట్టణంలో ఎక్కడైనా అనుమానాస్పదంగా ఇలాంటి వ్యక్తులు కనిపిస్తే



వెంటనే 8712656794 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.





# కొండగట్టు సమీపంలో భక్తుల కారు బోల్తా

**కాలువలో పడిపోయిన క్వాలిస్ వాహనం ● ప్రమాదంలో 12 మంది భక్తులకు గాయాలు**

**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య) :** కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తున్న భక్తుల వాహనం ప్రమాదానికి గురైంది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామ శివారులో మంగళవారం ఉదయం భక్తులతో వెళ్తున్న క్వాలిస్ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న లోతైన కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న మొత్తం 12 మంది భక్తులు గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేములవాడ నుంచి కొండగట్టు ఆలయానికి బయలుదేరిన క్వాలిస్ వాహనం నాచుపల్లి గ్రామ శివారులోని జేఎన్టీయూ కళాశాల సమీపానికి రాగానే ప్రమాదానికి గురైంది. రోడ్డుపక్కన ఉన్న లోతైన కాలువలోకి వాహనం దూసుకుపోవడంతో తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద తీవ్రతకు కారు పల్టీలు కొట్టినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సమీప గ్రామాల ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలో చిక్కుకున్న భక్తులను బయటకు తీసి, 108 అంబులెన్స్ సహాయంతో గాయపడిన వారిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాహనానికి సంబంధించిన బ్రేకులు సరిగా పనిచేయకపోవడమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గురైన భక్తులు వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. కొండగట్టు మార్గంలో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని పోలీసులు సూచించారు.





# బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి లబ్ధి చేకూర్చినట్లే!

- బీఆర్ఎస్ మద్దతుతో కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవాలని బీజేపీ పగటి కలలు కంటోంది
- ఎంఐఎంపై, బీజేపీ నేతల వ్యాఖ్యలు అర్థరహితం
- బీఆర్ఎస్, బీజేపీకి కరీంనగర్ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలి
- ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్
- ఎంఐఎంలో భారీగా చేరికలు

**నేటి సాక్షి, కరీంనగర్:** బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే.. బిజెపికి వేసినట్లేనని గతంలో కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపిలో చేరినట్లు, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సైతం కరీంనగర్లో కర్ణాటక తరహా రాజకీయం సృష్టిస్తున్నారని, కరీంనగర్ లో ప్రజలు తప్పుదారిన బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లను గెలిపిస్తే, వాళ్లు బిజెపిలో చేరడం ఖాయమని, అందుకే బిజెపి బిఆర్ఎస్ పార్టీ అండ చూసుకొని కరీంనగర్ కార్పొరేషన్ పై పగటి కలలు కంటోందని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం నగరంలోని 37వ డివిజన్ షాసాహబ్ మొహాల్ల, ఆమీర్ నగర్, గాయత్రీ నగర్ నుంచి బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు నూర్ భాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్లు ఖమరొద్దీన్ షబ్బీర్, ఎస్ఏ అజీజ్ తో పాటు వారి అనుచరులు, కుటుంబ సభ్యులు, జిల్లా నలుమూలల నుండి దూదేకుల సంఘం నుంచి 800మంది, 37వ డివిజన్ నుంచి 200 మంది, సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎంలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి గులాం అహ్మద్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మధు గార్డెన్ లో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలు తప్పులో కాలు వేసినట్లు అవుతుందని బిజెపికి ఓటు వేస్తే, కరీంనగర్ నగర భవిష్యత్తు అగమ్య గోచరంగా, అంధకారంగా మారుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ కరీంనగర్లో బిజెపి పార్టీతో లోపాయి కారి ఒప్పందం చేసుకొని, కరీంనగర్ కార్పొరేషన్ను బిజెపి పార్టీకి అప్పగించేందుకు రంగం సిద్ధం చేసిందని, తద్వారా రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు, క్విడ్ ప్రో కో మాదిరిగా, నాకిది, నీకది అన్న చందంగా కరీంనగర్లో రాజకీయాలను, ఈరెండు పార్టీలు కలుషితం చేసే ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారని విమర్శించారు. బిజెపి నేతలు ఎంఐఎం పార్టీని టార్గెట్ చేస్తూ, రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నారని, లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎంఐఎం పై అర్థరహిత వ్యాఖ్యలు మానుకోవాలని కేంద్రమంత్రికి గులాం అహ్మద్ హితువు పలికారు. కరీంనగర్ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా మీ ముందుకు వస్తున్న ఎంఐఎం పార్టీని ఆదరించి అక్కున చేర్చుకుని ఎంఐఎం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కరీంనగర్ వాసులకు విజ్ఞప్తి చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ 40డివిజన్లలో కమిటీలు ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉందని, హై కమాండ్ ఆదేశాల మేరకు ఎక్కువ డివిజన్లలో పోటీ చేసి 36డివిజన్లలో విజయఢంకా మోగించి మేయర్, డిప్యూటీ మేయర్లను కైవసం చేసుకుంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, బర్కత్ అలీ, సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, ఇబ్రహీం, ఖమరొద్దీన్, ఖాజా, అఖీల్ ఫిరోజ్, అలిబాబా, అజర్ దబీర్, ఆరిఫ్ అహ్మద్, సాజిద్, ఖాజా మజారొద్దీన్, అబ్దుల్లా అసిమ్, అంజద్ ఖాన్, లింగంపల్లి శ్రీనివాస్, గాలి రాజు సుధాకర్, ఖాజా భాయి తదితరులు పాల్గొన్నారు.